మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 180 | ఆదివారం | 28 - 12 - 2025 | పేజీలు: 8 | వెల: 4

## ఉపాధి హామీ చట్టాన్ని కాపాడాలి



5లో..

# క్రీడలకు ప్రధాన్యం ఇవ్వండి

- కనీసం ఓ గంట ఆటలకు కేటాయించాలి
- విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలి
- ఇండస్ స్కూల్ ను సందర్శించిన ఏపీఈడబ్ల్యూఐడీసీ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర

మనగళం, కర్నూలు సిటీ : విద్యతోపాటు క్రీడలకూ స్కూళ్ల యాజమాన్యాలు ప్రాధాన్యత ఇవ్వాలని ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) నగరూరు రాఘవేంద్ర సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించడంతోపాటు కనీసం ఓ గంట క్రీడలకు కేటాయించాలని పేర్కొన్నారు. కర్నూలు 2 లో..



## కర్ణాటకలో బుల్డోజర్ చర్యలు

- 200కుపైగా ఇళ్లు కూల్చివేత - 400 కుటుంబాలు నిరాశ్రయాలు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై వెల్లువెత్తిన విమర్శలు



బెంగళూరు, డిసెంబర్ 27, మన గళం, : కర్ణాటకలో జరిగిన భారీ ఇళ్ల కూల్చివేతలు రాజకీయంగా, సామాజికంగా తీవ్ర 2 లో..

## ఢిల్లీలో మళ్లీ ఉగ్రరూపం దాల్చిన వాయు కాలుష్యం




- ఓవరాల్ ఏక్యూఐ 355 - పలు ప్రాంతాల్లో 400కు పైగా
- దీర్ఘకాలిక పరిష్కారమే మార్గం: సీజేఐ ఆందోళన

న్యూఢిల్లీ, డిసెంబర్ 27 మన గళం, : దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రస్థాయిలో కొనసాగుతోంది. శనివారం ఉదయం కూడా నగరమంతా ప్రమాదకరమైన పొగమంచు కమ్మేయడంతో 2 లో..

## రేపు జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్స్



- ఏడువిభాగాల్లో సేవలు
- ఆర్డీఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు హాజరు
- భూ సమస్యల పరిష్కారానికి పకడ్బందీ చర్యలు
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

2 లో..

## ఉల్లి రైతులకు ఊరట:

### క్వింటాల్‌కు రూ.20 సాయం విడుదల




- చంద్రబాబు ఆదేశాలతో ప్రభుత్వం కీలక నిర్ణయం
- రూ.128.33 కోట్ల నిధుల విడుదల
- నాలుగు జిల్లాల్లో 37,752 మంది రైతులకు లబ్ధి

అమరావతి, డిసెంబర్ 27 మన గళం, :ఉల్లి ధరలు భారీగా పడిపోవడంతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 2 లో..

## ఉపాధి హామీ రద్దుపై కాంగ్రెస్ ఆగ్రహం



- దేశవ్యాప్త ప్రజా ఉద్యమానికి సిద్ధం కావాలి: ఖర్గే
- ప్రజాస్వామ్యం సంక్షోభంలో ఉందన్న సీడబ్ల్యూసీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 27 మన గళం, :: కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. మహాత్మా గాంధీ 2 లో..

## పవన్ కల్యాణ్‌పై అనుచిత సోషల్ మీడియా ప్రచారం

- వృద్ధురాలి ఫొటోలు వక్రీకరణపై తీవ్ర ఆగ్రహం
- కఠిన చర్యలు తీసుకోవాలంటూ జనసేన డిమాండ్

గుంటూరు, డిసెంబర్ 27 మన గళం, :ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పై సోషల్ మీడియాలో జరుగుతున్న అనుచిత ప్రచారం మరోసారి తీవ్ర వివాదానికి దారి తీసింది. రాజకీయ కక్ష సాధింపులో భాగంగా పవన్‌ను లక్ష్యంగా చేసుకుని అసభ్యకర వ్యాఖ్యలు, వికృత పోస్టులు చేయడం కొందరికి అలవాటుగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి ఘటనల్లో గతంలో పలువురిని పోలీసులు 2 లో..



# కర్ణాటకలో బుల్డోజర్ చర్యలు

దుమారం రేపుతున్నాయి. బెంగళూరు శివారులోని కోగిలు గ్రామంలో అధికారులు 200కుపైగా ఇళ్లను కూల్చివేయడంతో సుమారు 400 కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. వీరిలో ఎక్కువ మంది ముస్లిం కుటుంబాలే కావడంతో, ఈ చర్యపై మానవ హక్కుల సంఘాలు, రాజకీయ పార్టీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. డిసెంబర్ 22న తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో కోగిలు గ్రామం లోని ఫకీర్ కాలనీ, వాసిం లేఅవుట్ ప్రాంతాల్లో ఈ కూల్చివేతలు జరిగాయి. బెంగళూరు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ డ్రైవ్‌లో నాలుగు జేసీబీలను వినియోగించారు. ఎలాంటి అడ్డంకులు తలెత్తకుండా ఉండేందుకు 150 మందికిపైగా పోలీసు సిబ్బందిని మోహరించారు. ఉర్దూ ప్రభుత్వ పాఠశాల సమీపంలోని సరస్సు పరిధిలో ఉన్న సుమారు ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించారని ప్రభుత్వం ఆరోపించింది. అయితే, స్థానిక నివాసితులు ఈ ఆరోపణలను ఖండిస్తున్నారు. తమకు ముందస్తు నోటీసులు ఇవ్వలేదని, తెల్లవారుజామున పోలీసులు బలవంతంగా ఖాళీ చేయించి ఇళ్లను కూల్చివేశారని వాపోయారు. చలికాలంలో వృద్ధులు, చిన్నపిల్లలతో సహా వందలాది మంది రోడ్డున పడిపోయారని, తాత్కాలిక గుడారాల కింద తలదాచుకుంటున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో అమలు చేస్తున్న 'బుల్డోజర్ రాజ్యం'ను కర్ణాటకలో కూడా అనుసరిస్తున్నారని వామపక్ష పార్టీలు మండిపడ్డాయి. ఈ విషయంపై పినరయి విజయన్ కూడా తీవ్రంగా స్పందిస్తూ, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ వ్యతిరేక రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు.

ఇళ్ల కూల్చివేతల నేపథ్యంలో బాధిత కుటుంబాలకు పునరావాసం, న్యాయం కల్పించాలన్న డిమాండ్లు బలపడుతున్నాయి. ప్రభుత్వ చర్యలు చట్టబద్ధమైనవైనా, మానవీయ కోణాన్ని పూర్తిగా విస్మరించాయన్న ఆరోపణలు కర్ణాటక రాజకీయాలను మరింత వేడెక్కిస్తున్నాయి.

# ఢిల్లీలో మళ్లీ ఉగ్రరూపం

## దాల్చిన వాయు కాలుష్యం

ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజా గణాంకాల ప్రకారం నగరంలో ఓవరాల్ గాలి నాణ్యత సూచిక (ఏక్యూఐ) 355గా నమోదై, 'వెరీ పూర్' కేటగిరీలో కొనసాగుతోంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం 9 గంటల సమయానికి ఢిల్లీలో కాలుష్య స్థాయిలు మరింత పెరిగాయి. ఆనంద్ విహార్‌లో ఏక్యూఐ 410గా, జహన్‌గిరిపురిలో 414గా నమోదైంది. నరేలా, రోహిణి ప్రాంతాల్లో 406గా, షాదిపూర్‌లో 408గా నమోదవడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లో కూడా గాలి నాణ్యత తీవ్రంగా దిగజారినట్లు అధికారులు వెల్లడించారు. దట్టమైన పొగమంచు కారణంగా రోడ్డు రవాణా మందగించడంతో పాటు, శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారు మరింత ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో ఉన్నవారు అత్యవసరంగా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. మాస్క్ వినియోగం, అవసరం లేని బయటి ప్రయాణాల్ని తగ్గించడం వంటి సూచనలు మళ్లీ ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఇదిలా ఉండగా, రాజధానిలో తీవ్ర వాయు కాలుష్య పరిస్థితులపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఇటీవల ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఢిల్లీని పీడిస్తున్న ఈ సమస్యకు తాత్కాలిక ఉపశమన చర్యలు సరిపోవని, దీర్ఘకాలిక పరిష్కారాలే అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజారోగ్యానికి పెద్ద సవాలుగా మారిన వాయు కాలుష్యానికి పర్యావరణ నిపుణులు సమర్థవంతమైన పరిష్కారాన్ని కనుగొంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ పెరుగుతుండగా, ఢిల్లీ వాయు నాణ్యత సంక్షోభం మరోసారి దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# ఉపాధి హామీ రద్దుపై కాంగ్రెస్ ఆగ్రహం


జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి పేదల కడుపు కొట్టారని ఆరోపించారు. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమానికి సిద్ధం కావాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరిగిన ఈ కీలక సమావేశానికి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సీనియర్ నేత శశి థరూర్ సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. సమావేశంలో ఖర్గే మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని అన్నారు. పేదలు, గ్రామీణ కుటుంబాలకు ఉపాధి భద్రత కల్పించేందుకు యూపీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను రద్దు చేయడం అన్యాయమని వ్యాఖ్యానించారు. ఈ ప్రభుత్వానికి పేదల కంటే కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలే ముఖ్యమని విమర్శించారు. ఉపాధి హామీ చట్టం రద్దును ఖర్గే వ్యవసాయ చట్టాలతో పోల్చారు. రైతుల పోరాటంతో వ్యవసాయ చట్టాలు వెనక్కి తీసుకున్నట్లే, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ రద్దుకు వ్యతిరేకంగా కూడా దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రజల ఐక్య పోరాటంతోనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను మార్చవచ్చని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, పౌరుల హక్కులకు తీవ్రమైన ముప్పు పొంచి ఉందని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ భారతంలో పేదలకు ఉపాధి భద్రత కల్పించేందుకు యూపీఏ ప్రభుత్వం ముందుచూపుతో ఈ పథకాన్ని తీసుకువచ్చిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని, ప్రజల తరఫున పోరాడే బాధ్యత పార్టీపై ఉందని సీడబ్ల్యూసీ సమావేశం స్పష్టం చేసింది.

# క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వండి











నగరల పరిధిలోని గుత్తి పెట్రోల్ బంక్ సమీపాన ఉన్న ఇండస్ స్కూల్ ను శనివారం ఏపీఈడబ్ల్యూఐడీసీ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర సందర్శించారు. డైరెక్టర్ నగరూరు రాఘవేంద్రకు ఇండస్ స్కూల్ యాజమాని రాజశేఖర్, ప్రిన్సిపాల్ మీనాక్షి, విద్యార్థులు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్కూల్ తరగతి గదులను నగరూరు రాఘవేంద్ర పరిశీలించారు. రికార్డులను సైతం పరిశీలించారు. అదేవిధంగా మౌలిక వసతుల కల్పనపై సంతృప్తి వ్యక్తం చేశారు. స్కూల్ ను కలియతిరిగిన డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర.....క్రీడా ప్రాంగణాన్ని తీర్చిదిద్దిన తీరుపై యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. అయితే విద్యార్థులు క్రీడలలో పాల్గొనేలా ప్రోత్సహించాలని ప్రిన్సిపాల్ మీనాక్షికి ఈ సందర్భంగా నగరూరు సూచించారు. క్రీడల ప్రాధాన్యతను విద్యార్థులకు అర్థమయ్యేలా వివరిస్తే స్కూల్ కు ఎంతో పేరు, ప్రఖ్యాతలు తీసుకొచ్చే అవకాశం ఉందనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. అదేవిధంగా క్రీడల్లో ప్రతిభ చాటితే విద్యార్థులకు సైతం మంచి భవిష్యత్తు ఉంటుందని, ఎంతో గుర్తింపు తెచ్చుకునే అవకాశాన్ని కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని గుర్తు చేశారు. తదనంతరం ఏపీఈడబ్ల్యూఐడీసీ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్రను ఇండస్ స్కూల్ యాజమాని రాజశేఖర్, ప్రిన్సిపాల్ మీనాక్షి, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి మెంటో అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో సుమన్ టీవీ ఉమ్మడి కర్నూలు జిల్లా, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాల ఉపాధ్యక్షుడు మధుసూధన్, బీజేపీ జిల్లా నాయకులు దిలీప్ శర్మ, రామక్రిష్ణ, మధుకుమార్, రామాంజి, ఇండస్ స్కూల్ ప్రతినిధి విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్స్

మనగళం, నంద్యాల: భూ సమస్యల పరిష్కారానికి నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పకడ్బందీగా చర్యలు చేపడుతున్నారు. ప్రజల రెవెన్యూ సంబంధిత సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించాలనే ఉద్దేశ్యంతో ఈ నెల 29వ తేదీ సోమవారం కలెక్టరేట్ ఆవరణలో జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలో మొత్తం 7 రెవెన్యూ క్లినిక్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ క్లినిక్స్‌లో ప్రజల నుంచి రెవెన్యూ సంబంధిత అర్జీలను స్వీకరించి, వాటిని నమోదు చేసి, సమస్యల స్వరూపాన్ని బట్టి అక్కడికక్కడే పరిష్కార చర్యలు చేపడతామన్నారు. ఇందుకోసం సంబంధిత విభాగాలకు చెందిన ఆర్డీఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలకు నేరుగా సేవలు అందిస్తారని తెలిపారు. భూ సమస్యలను ఏడు విభాగాలుగా విభజించి రెవెన్యూ క్లినిక్స్‌ను నిర్వహించనున్నట్లు కలెక్టర్ వివరించారు. రెవెన్యూ, గ్రామ, వార్డు సచివాలయ సేవలకు సంబంధించిన సమస్యలకు పరిష్కారం. అడంగల్ సవరణలకు సంబంధించిన అంశాలు. 22ఎ, చుక్కల భూముల క్రమబద్ధీకరణ సంబంధిత సమస్యలు. అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించిన అంశాలు. రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్‌ఓఆర్ కేసులు. సర్వే, రీ-సర్వేకు సంబంధించిన సమస్యలు. దేవాదాయ, వక్ఫ్ భూముల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు. రెవెన్యూ క్లినిక్స్‌లో ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన ప్రత్యేక అర్జీలను నేరుగా సమర్పించవచ్చని, అర్జీల స్వీకరణతో పాటు నమోదు ప్రక్రియ కూడా జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ రెవెన్యూ సమస్యలను పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రకటనలో సూచించారు.

# పవన్ కల్యాణ్‌పై అనుచిత సోషల్ మీడియా ప్రచారం

అరెస్ట్ చేసినప్పటికీ, కొందరి తీరు మారడం లేదన్న ఆవేదన వ్యక్తమవుతోంది. తాజాగా గుంటూరు జిల్లా ఇప్పటం లో పవన్ కల్యాణ్ ఓ వృద్ధురాలిని కలిసిన సందర్భానికి సంబంధించిన ఫొటోలను వక్రీకరించి, అనుచిత భావాలతో సోషల్ మీడియాలో పోస్టు చేయడం తీవ్ర కలకలం రేపింది. ఈ పోస్టులు వెలుగులోకి రావడంతో జనసేన నేతలు, కార్యకర్తలు, పవన్ అభిమానులు తీవ్ర ఆగ్రహావేశాలకు గురయ్యారు. పవన్ మానవతా భావాన్ని, ఆయన వ్యక్తిత్వాన్ని దిగజార్చే ప్రయత్నంగా దీనిని వారు ఖండిస్తున్నారు. ఇటీవల ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఇప్పటానికి చెందిన వృద్ధురాలు ఇండ్ల నాగేశ్వరమ్మను పవన్ కల్యాణ్ స్వయంగా కలిసిన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా పవన్ ఆమె కాళ్లకు నమస్కరించి, మాతృభావంతో ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. వృద్ధురాలికి తక్షణ సహాయంగా రూ.50 వేల ఆర్థిక సాయం, ఆమె మనవడి చదువుకు రూ.లక్ష అందించి, భవిష్యత్తులోనూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ మానవీయ చర్యతో ఆ వృద్ధురాలు భావోద్వేగానికి గురై ఆనందం వ్యక్తం చేశారు. అయితే, ఈ ఫొటోలను ఓ వ్యక్తి అనుచిత వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో పోస్టు చేయడం సంచలనంగా మారింది. నిందితుడు గుంటూరు జిల్లాకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. మహిళలు, వృద్ధుల పట్ల గౌరవం లేని ఈ చర్యను జనసేన నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇది పవన్‌ను మాత్రమే కాకుండా, ఆ వృద్ధురాలి గౌరవాన్ని కూడా కించపరిచే దుర్మార్గ చర్యగా వారు అభివర్ణించారు. ఈ వ్యవహారంపై జనసేన పార్టీ కార్యకర్తలు వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియాలో ఇలాంటి వికృత ప్రచారానికి పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రజాజీవితంలో ఉన్న నాయకులపై విమర్శలు హద్దులు దాటకూడదని, మహిళలు, వృద్ధుల గౌరవాన్ని కాపాడేలా చట్టాలు అమలవ్వాలని జనసేన శ్రేణులు స్పష్టం చేస్తున్నాయి.

# ఉల్లి రైతులకు ఊరట: క్వింటాల్‌కు రూ.20 సాయం విడుదల

ఈక్రాప్‌లో నమోదు చేసుకున్న ఉల్లి రైతులకు క్వింటాల్‌కు రూ.20 చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం రూ.128.33 కోట్ల నిధులను విడుదల చేసింది.ఈ నిర్ణయంతో కడప, అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లోని మొత్తం 37,752 మంది ఉల్లి రైతులు లబ్ధి పొందనున్నారు. ఉల్లి ధరలు ఒక్కసారిగా పడిపోవడంతో పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితుల్లో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టిందని అధికారులు తెలిపారు.ఈక్రాప్ విధానంలో నమోదు చేసిన వివరాల ఆధారంగా అర్హులైన రైతులను గుర్తించి సాయం అందించనున్నట్లు స్పష్టం చేశారు. రైతులకు నేరుగా ఆర్థిక భరోసా కల్పించాలన్న లక్ష్యంతో ఈ సాయం ఖాతాల్లోకి జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. ధరల ఊగిసలాట వల్ల రైతులు నష్టపోకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు.వ్యవసాయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఉల్లి రైతులకు ప్రకటించిన ఈ సాయం వల్ల నష్టాల భారం కొంతైనా తరుగుతుందని, రాబోయే కాలంలో రైతులకు మరింత భరోసా కల్పించే చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

## రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ఈ నెల 29వ తేదీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజల నుండి వినతులు స్వీకరించి పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కేంద్రం కర్నూలుతో పాటు అన్ని మండల కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాలు, డివిజన్ స్థాయిలోనూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవాలన్నా కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేయాలని సూచించారు. అలాగే అర్జీదారులు మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ లోనూ ప్రజలు అర్జీలు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

## ఘనంగా కాటసాని జన్మదిన వేడుకలు



మనగళం, కర్నూలు సిటీ : పాణ్యం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత కాటసాని రాంభూపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, బంధువుల సమక్షంలో కాటసాని కేక్ కట్ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అభిమానులు కాటసానిని గజమాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాటసానితో ఫొటోలు దిగి సంబరాలు చేసుకున్నారు. అనంతరం కాటసాని అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైసీపీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులు, కల్లూరు 16 వార్డు ల నాయకులు, కల్లూరు,ఓర్వకల్లు,గడివేముల, పాణ్యం మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉగాదికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

**– కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**





మనగళం, కర్నూలు సిటీ : జిల్లాలో ఆప్షన్ 3 కింద నిర్మాణంలో 6 వేల పెండింగ్ ఉన్న ఇళ్లను ఉగాది నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఆప్షన్ 3 కాంట్రాక్టర్ లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో ఆప్షన్ 3 కింద జరుగుతున్న హౌసింగ్ నిర్మాణాల పురోగతి పై కలెక్టర్ కాంట్రాక్టర్ లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆప్షన్ 3 కింద నిర్మాణం జరుగుతున్న 10 వేల 34 ఇళ్ళకి గాను ఇప్పటివరకు 4 వేల 794 ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయన్నారు. ఆప్షన్3 కింద కాంట్రాక్టర్ లు నిర్మించిన ఇళ్లలో 2 వేల 522 ఇళ్లలో నిర్మాణ లోపాలను గుర్తించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 868 ఇళ్ల నిర్మాణాల లోపాలను సరిచేయడం జరిగిందని, మిగిలిన వాటిని వారం లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆప్షన్ 3 కాంట్రాక్టర్ లను ఆదేశించారు. నేడు హాజరవ్వని ఆప్షన్ 3 కాంట్రాక్టర్ లు సోమవారం జరిగే సమావేశానికి హాజరు కావాలని, లేని పక్షంలో చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ హౌసింగ్ కి సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే కలెక్టర్, తన దృష్టికి తీసుకొని వస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆప్షన్ 3 కాంట్రాక్టర్ లు తమకు ఎన్ఆర్ఈజీఎస్ కి సంబంధించిన పెండింగ్ బిల్లులు త్వరగా మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ చిరంజీవి, ఆప్షన్ 3 కాంట్రాక్టర్ లు తదితరులు పాల్గొన్నారు.

# ‘పది’ విద్యార్థుల ఉత్తీర్ణతలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

**– ప్రతి విద్యార్థి 85 శాతం పైగా మార్కులు సాధించాలి – జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**



మనగళం, కర్నూలు సిటీ : పదవ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. పదవ తరగతి లో ఉత్తీర్ణతా శాతం పెంచడం లో భాగంగా ఇందిరాగాంధీ స్మారక నగరపాలక ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ మెంటార్ గా ఎంపిక చేసుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం కర్నూలు నగరం ఏ క్యాంప్ లోని ఇందిరాగాంధీ స్మారక నగరపాలక ఉన్నత పాఠశాల ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో, వారి తల్లిదండ్రులతో మాట్లాడి మార్గ నిర్దేశనం చేశారు. పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో తల్లిదండ్రులు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పదవ తరగతి పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తును నిర్ధారించే కీలక దశ అని, ఈ సమయంలో తల్లిదండ్రుల ప్రోత్సాహం, పర్యవేక్షణ అత్యంత అవసరమన్నారు. విద్యార్థులపై అనవసర ఒత్తిడి పెట్టకుండా, ఇంట్లో చదువుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలని కలెక్టర్ తల్లిదండ్రులకు సూచించారు. పదవ తరగతి సిలబస్ మొత్తం పూర్తి అయిందని, ఈ మూడు నెలలు పిల్లలు బాగా చదువుకునేలా చూడాలని చెప్పారు. విద్యార్థులు పాఠశాలకు తప్పనిసరిగా హాజరై, ఉపాధ్యాయులు సూచించిన విధంగా చదువుకునే విధంగా తల్లిదండ్రులు సహకరించాలని సూచించారు. పిల్లలు వినోదం కొరకు మొబైల్ ఫోన్ల వినియోగించకుండా చూడాలని, అదే విధంగా పిల్లల ఆరోగ్యంగా ఉండేలా మంచి ఆహారం అందించేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా ప్రతి రోజు విద్యార్థులకు సాయంత్రం సమయంలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పాఠశాలకు అప్పుడప్పుడు వచ్చి పిల్లలు ఏ విధంగా చదువుతున్నారు, ఏ విధంగా భోజనం ఉంటుంది అనే విషయాలను పరిశీలించుకోవాలని కలెక్టర్ తల్లితండ్రులకు సూచించారు. ప్రతి ఒక్క విద్యార్థికి 85 శాతం పైగా మార్కులు రావడంతో పాటు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి రోజు నిర్వహించే యూనిట్ టెస్ట్ లో ఖచ్చితంగా 20 మార్కులకు 15 మార్కులు పైగా రావాలని కలెక్టర్ విద్యార్థులకు తెలిపారు. ఉపాధ్యాయులు పాఠాలు ఏ విధంగా చెప్తున్నారు, భోజనం రుచిగా ఉంటుందా, భోజనం సరిపడేంత పెడుతున్నారా, అని కలెక్టర్ విద్యార్థులను ఆరా తీశారు. అన్నం సరిగా ఉడకడం లేదని, కోడిగుడ్డు, సాంబార్ లో కూరగాయలు సరిగ్గా ఉడకడం లేదని విద్యార్థులు తెలపగా కలెక్టర్ వంట గదిని పరిశీలించారు. విద్యార్థుల నుండి ఫిర్యాదులు రాకుండా అన్నం, కోడిగుడ్డు, సాంబార్ లో కూరగాయలు బాగా ఉడకబెట్టాలని, మెనూ ప్రకారం భోజనం రుచిగా, శుచిగా వంటలు చేయాలని కలెక్టర్ వంట సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఓ సుధాకర్, హెడ్ మాస్టర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# 29న జరిగే జీపు జాతను జయప్రదం చేయండి




మనగళం, కర్నూలు సిటీ : విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు జరిగే సీఐటీయూ అఖిలభారత మహాసభలు జయప్రదం చేయాలని, జనవరి 4న విశాఖపట్నంలో జరిగే భారీ బహిరంగ సభకు కార్మిక వర్గం కదలివచ్చి విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండి అంజిబాబు పిలుపునిచ్చారు. శనివారం కార్మిక కర్షక భవన్లో మహాసభల జయ ప్రధానికై పోస్టర్లు,బ్యానర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిఎస్ రాధాకృష్ణ, ఎండి అంజిబాబు మాట్లాడారు. ఈనెల 29వ తేదీన కర్నూలు జిల్లాలో జరిగే జీపు జాతాను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గ హక్కులను కాలరాస్తూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మార్పు చేస్తూ యజమానులకు తొత్తులుగా ఈ ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. కార్మిక చట్టాలు మార్పు వల్ల కార్మికులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, పాత చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు సిహెచ్ సాయి బాబా, కె. ప్రభాకర్, బతుకన్న కార్మికులు పాల్గొన్నారు.

# రెవెన్యూ అధికారులు అప్రమత్తం కావాలి


**– 29న నిర్వహించే రెవెన్యూ క్లినిక్స్ కు సమాయత్తం కావాలి – నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**




మనగళం, నంద్యాల : ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ రెవెన్యూ సమస్యలకు సమగ్రంగా పరిష్కారం చూపేందుకు రెవెన్యూ క్లినిక్స్‌ను నిర్వహిస్తున్నామని, సంబంధిత అధికారులు అప్రమత్తం కావాలని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమావేశంలో రెవెన్యూ క్లినిక్స్ నిర్వహణ, జనవరి 2 నుండి పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, రీసర్వే ఫేజ్4 అమలుపై జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశాలు చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, నంద్యాల, డోన్, ఆత్మకూరు డివిజన్ల ఆర్డీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో పెద్దఎత్తున రెవెన్యూ క్లినిక్స్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో అధికారులు పూర్తిస్థాయిలో సమాయత్తం కావాలని ఆదేశించారు. వివిధ సమస్యలతో క్లినిక్స్‌కు వచ్చే అర్జీదారులు ఏ కౌంటర్‌ను సంప్రదించాలి, ఏ రకమైన దరఖాస్తులు సమర్పించాలి అనే అంశాలపై ముందుగానే వారికి స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా రెవెన్యూ క్లినిక్స్‌కు హాజరయ్యే అధికారులు సంబంధిత అన్ని రికార్డులు, దస్త్రాలతో సిద్ధంగా ఉండాలని, అర్జీదారులకు తక్షణమే సరైన మార్గనిర్దేశం చేస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టాదారు పాస్ పుస్తకాలను జనవరి 2వ తేదీ నుండి పంపిణీ చేయాలని, ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులను కూడా భాగస్వాములను చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అలాగే రీసర్వే ఫేజ్4 ప్రక్రియను సక్రమంగా, సమయపాలనతో నిర్వహించేలా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

# ఆదోని ను జిల్లాగా ప్రకటించేవరకు పోరాటానికి మద్దతుగా ఉంటాం

**– ఆలూరు దీక్ష శిబిరంలో ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి**



( ఆలూరు మనగళం ):ఆదోని ను జిల్లాగా ప్రకటించే వరకు జెఏసి చేపడుతున్న ఆందోళన కార్యక్రమాలకు, దీక్షలకు లకు వైసిపి అండగా ఉంటుందని ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు 16 రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్వామి వివేకానంద పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు రిటైర్డ్ డీఎస్పీ లు రంగముని, శ్రీరాములు, రిటైర్డ్ ఆర్టీసీ డిఎం వెంకటరమణ, రిటైర్డ్ ఉద్యోగులు ఈరన్న, నరసింహులు, మాలిక్ సాబ్, రాజేంద్రప్రసాద్, చంద్రశేఖర్, సుందర్ రాజ్, గిరయ్య, యాకూబ్, తిమ్మప్ప, బ్రహ్మ,మహా బలేశ్వర స్వామి కూర్చున్నారు. వీరికి ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, వైసీపీ నాయకులు సీతా రామిరెడ్డి, చంద్రకాంత్ రెడ్డి,సంఘీభావం ప్రకటించారు. వెనుకబడిన ఆలూరు ప్రాంతంలో వేదవతి ప్రాజెక్టు పూర్తి కావాలంటే ఆదోనిను జిల్లాగా ప్రకటించాల్సిన అవసరం ఉందన్నారు. ఆదోనిలో మెడికల్ కళాశాల కూడా అందుబాటులో వస్తాయన్నారు. ఈ విషయం పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. మా పార్టీ అధినేత జగన్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. జెఏసి నాయకులు కత్తి రామాంజనేయులు, భూపేష్, రామ్ భీం నాయుడు , ఎల్లప్ప, బంగారు రామకృష్ణ, పూల రామాంజనేయులు, చంద్రకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

# గోరంట్ల సచివాలయాన్ని జిల్లా మేనేజర్ సివిల్ సప్లై ఆఫీసర్ వెంకట రాముడు ఆకస్మిక తనిఖీ





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండల పరిధిలోని గోరంట్ల గ్రామ సచివాలయాన్ని మండల స్పెషల్ ఆఫీసర్ డిస్టిక్ మేనేజర్ సివిల్ సప్లై ఆఫీసర్ వెంకటరాముడు ఆకస్మికంగా తనకి చేశారు. సచివాలయ సిబ్బంది పనితీరును సమీక్షించారు సిబ్బంది హాజరు రిజిస్టర్ స్పందన రిజిస్టరు మూమెంట్ రిజిస్టర్ను తనిఖీ చేశారు. ఎంపీడీవో ఏసి రాముడితో కలిసి మండలంలోని గోరంట్ల గ్రామపంచాయతీలో సచివాలయంలో అసంపూర్తిగా ఉన్నటువంటి సర్వేలు త్వరగా పూర్తి చేయాలని పబ్లిక్ పర్సెప్షన్ సానుకూలంగా ఉండేలాగా చర్యలు తీసుకోవాలని రిజిస్టర్ చెక్ చేస్తూ బయోమెట్రిక్ రోజుకు రెండుసార్లు తప్పనిసరిగా మార్క్ చేయవలెనని ఆదేశించారు. అదే విధంగా గోరంట్ల లేఅవుట్లో ఇల్లు కట్టుకున్నటువంటి లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడి ఇల్లు కట్టుకోవాలని ఇల్లు కట్టుకోని పక్షంలో రద్దు చేయబడతాయని కాలనీలో ఇళ్ల నిర్మాణానికి త్వరగా బిల్లులు కూడా చెల్లింపులు చేయడం జరుగుతుందని లబ్ధిదారులతో మాట్లాడారు. సమీపంలో ఉన్నటువంటి ఎస్సీ కాలనీ స్కూల్లో సందర్శించి అక్కడ టీచర్స్ తోను పిల్లలతోనూ సమీక్షలు చేయిస్తూ పిల్లలకు మధ్యాహ్న భోజనం విధానం పైన పిల్లలకు చదువు విషయం పైన డ్రాప్స్ అవుట్స్ పైన సమాచారం అడిగి తెలుసుకున్నారు.

# శ్రీ గురు గోబింద్ సింగ్ జీ ప్రకాశ్ ఉత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ఘన నివాళులు


న్యూఢిల్లీ, డిసెంబర్ 27 మన గళం ::శ్రీ గురు గోబింద్ సింగ్ జీ ప్రకాశ్ ఉత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారికి శిరసు వంచి ఘన నివాళులు అర్పించారు. ధైర్యం, కరుణ, త్యాగాలకు ఆయన జీవితం ప్రతిరూపమని పేర్కొంటూ, గురు గోబింద్ సింగ్ జీ బోధనలు సత్యం, న్యాయం, ధర్మం కోసం నిలబడాలని ప్రతి తరానికి స్ఫూర్తినిస్తున్నాయని తెలిపారు. మానవ గౌరవాన్ని కాపాడే మార్గాన్ని ఆయన చూపించారని మోదీ కొనియాడారు. అణచివేతకు ఎదురొడ్డి నిలబడి ధర్మ రక్షణ కోసం పోరాడిన గురు గోబింద్ సింగ్ జీ జీవితం దేశానికి చిరకాల ప్రేరణగా నిలుస్తుందని ప్రధాని అన్నారు. సేవ, నిస్వార్థ త్యాగం, సమానత్వం వంటి విలువలను ఆయన ఆచరణలో పెట్టి చూపారని పేర్కొన్నారు. ఆయన బోధనలు నేటి సమాజానికి మరింత అవసరమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బిహార్ రాష్ట్రంలోని పవిత్ర పాట్నా సాహిబ్ గురుద్వారాను ఈ ఏడాది ప్రారంభంలో తాను సందర్శించిన సందర్భాన్ని మోదీ గుర్తు చేసుకున్నారు. అక్కడ శ్రీ గురు గోబింద్ సింగ్ జీ పవిత్ర జోరే సాహిబ్, మాతా సాహిబ్ కౌర్ జీ దర్శనం చేసుకున్న అనుభూతి తనకు ఆధ్యాత్మిక బలాన్ని అందించిందని తెలిపారు. శ్రీ గురు గోబింద్ సింగ్ జీ దృష్టి సేవ, త్యాగం, స్వార్థరహిత కర్తవ్యంపై ఆధారపడిందని ప్రధాని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గం తరతరాలకు దారి చూపుతూ, సమాజాన్ని ధైర్యంగా, ధర్మబద్ధంగా ముందుకు నడిపిస్తుందని ఆకాంక్షించారు.

# ఉగ్రదాడి జ్ఞాపకాలను దాటేసిన పర్యాటకులు



పహల్గామ్, డిసెంబర్ 27 మన గళం :కొన్ని నెలల క్రితం జరిగిన భయానక ఉగ్రదాడి జ్ఞాపకాలను పక్కనబెట్టి పర్యాటకులు మళ్లీ జమ్మూ కశ్మీర్ వైపు అడుగులు వేస్తున్నారు. ముఖ్యంగా లోయలోని అందమైన పర్యాటక కేంద్రం పహల్గామ్ కొత్త సంవత్సర వేడుకలకు కేంద్రంగా మారుతోంది. శనివారం నుంచే పెద్ద సంఖ్యలో పర్యాటకులు పహల్గామ్‌కు చేరుకుంటుండటంతో కశ్మీర్ లోయలో మళ్లీ పర్యాటక కళ కనిపిస్తోంది. గత ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు మృతి చెందడంతో కశ్మీర్ పర్యాటక రంగం తీవ్రంగా దెబ్బతింది. ఆ ఘటన తర్వాత వేలాది మంది తమ పర్యటనలను రద్దు చేసుకున్నారు. పర్యాటక ప్రదేశాలు మూతపడటంతో హోటళ్లు, రెస్టారెంట్లు, టాక్సీ ఆపరేటర్లు తీవ్ర నష్టాలు చవిచూశారు. పర్యాటక రంగంపై ఆధారపడి జీవించే వేలాది కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాయి. అయితే, ప్రస్తుతం పరిస్థితులు క్రమంగా మెరుగుపడుతున్నాయి. నగర జీవన ఒత్తిడికి దూరంగా ప్రశాంతంగా సమయం గడపాలనుకునే వారు మళ్లీ పహల్గామ్‌ను ఎంచుకుంటున్నారు. భద్రతా ఏర్పాట్లు బలంగా ఉండటంతో పర్యాటకులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. హర్యానాకు చెందిన ఓ పర్యాటకురాలు మాట్లాడుతూ, “నేను నా భర్తతో కలిసి తొలిసారిగా కశ్మీర్‌కు వచ్చాను. ఇది నిజంగా అద్భుతంగా ఉంది. భద్రతా ఏర్పాట్లు చాలా బాగున్నాయి. కొత్త సంవత్సరాన్ని ఇక్కడ జరుపుకోవడం సురక్షితంగా అనిపిస్తోంది” అని చెప్పారు. కొత్త సంవత్సర వేడుకల కోసం కళాశాల విద్యార్థుల బృందాలు కూడా పహల్గామ్‌కు చేరుకున్నాయి. ఓ విద్యార్థి మాట్లాడుతూ, “ఇప్పుడు పరిస్థితులు చాలా మెరుగ్గా ఉన్నాయి. ఇంతకుముందు శ్రీనగర్ వెళ్లాను, ఇప్పుడు పహల్గామ్‌లో ఉన్నాను. ఇంకా మంచు కురవలేదు కానీ రాబోయే రెండు మూడు రోజుల్లో కురుస్తుందని ఆశిస్తున్నాం. స్థానికులు ఎంతో సహకరిస్తున్నారు” అని తెలిపాడు.ఏప్రిల్ దాడి తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యాటకుల్లో భరోసా నింపేందుకు పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాయి. ప్రస్తుతం పెరుగుతున్న పర్యాటకుల రాక, కశ్మీర్ పర్యాటక రంగం మళ్లీ పుంజుకుంటుందన్న ఆశలకు బలం చేకూరుస్తోంది. శాంతి, భద్రత కొనసాగితే రాబోయే రోజుల్లో కశ్మీర్ మళ్లీ దేశీయ, అంతర్జాతీయ పర్యాటకుల హబ్‌గా మారుతుందన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

# అంతర్జాతీయ సినీ దినోత్సవం: వినోదాన్ని మించి సమాజాన్ని ప్రభావితం చేసే వెండితెర శక్తి



డెస్క్, మన గళం : సినిమా అనేది కేవలం రెండు మూడు గంటల వినోదానికి మాత్రమే పరిమితమైన కళ కాదు. అది ఒక కాలాన్ని, ఒక సమాజాన్ని, ఒక తరం ఆలోచనలను ప్రతిబింబించే శక్తివంతమైన మాధ్యమం. అంతర్జాతీయ సినీ దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా సినిమా కళ ప్రాముఖ్యతను గుర్తు చేసుకునే సందర్భంగా నిలుస్తోంది. మాటలతో చెప్పలేని భావాలను, చిత్రాల రూపంలో ప్రేక్షకుల మనసులకు చేరవేసే అసాధారణ శక్తి సినిమాకు ఉంది. అందుకే సినిమా అనేది వినోదంతో పాటు ఆలోచనలను రేకెత్తించే సాధనంగా ఎదిగింది.

ప్రతి సమాజం తన సమస్యలను, తన పోరాటాలను, తన ఆశలను సినిమాల రూపంలోనే ఎక్కువగా వ్యక్తపరుస్తుంది. పేదరికం, నిరుద్యోగం, సామాజిక అసమానతలు, మహిళలపై వివక్ష, మానవ సంబంధాల సంక్లిష్టత వంటి అంశాలు కథలుగా మారి వెండితెరపై కనిపిస్తాయి. కొన్ని సినిమాలు సమాజంలోని కఠిన సత్యాలను నిర్భయంగా చూపిస్తే, మరికొన్ని మార్పు సాధ్యమనే నమ్మకాన్ని ప్రేక్షకుల్లో నింపుతాయి. ఈ విధంగా సినిమా ప్రజల ఆలోచనా విధానాన్ని మెల్లగా ప్రభావితం చేస్తూ ముందుకు సాగుతోంది.

సినిమా ప్రభావం వ్యక్తిగత స్థాయిలోనే కాకుండా సామూహిక స్థాయిలో కూడా స్పష్టంగా కనిపిస్తుంది. ఒక పాత్రలో ప్రేక్షకుడు తన జీవితాన్ని చూసుకుంటాడు. ఒక కథలో తన బాధను, తన ఆశను గుర్తిస్తాడు. ఈ అనుబంధమే సినిమాను అత్యంత ప్రభావవంతమైన మాధ్యమంగా మార్చింది. ఒక మంచి సినిమా వెయ్యి ఉపన్యాసాలకంటే ఎక్కువగా సమాజాన్ని ప్రభావితం చేయగలదన్న వాస్తవాన్ని చరిత్ర ఎన్నోసార్లు నిరూపించింది.

అయితే ఈ శక్తితో పాటు ఒక పెద్ద బాధ్యత కూడా ఉంటుంది. నిర్లక్ష్యంగా, కేవలం వాణిజ్య లాభాల కోసమే రూపొందించే సినిమాలు సమాజంపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉంది. హింసను మహిమాపరచడం, ద్వేషాన్ని సహజీకరించడం, అసత్య విలువలను గొప్పగా చూపించడం దీర్ఘకాలంలో సామాజిక ఆలోచనలను దెబ్బతీయగలదు. అందుకే సినిమా స్వేచ్ఛతో పాటు సామాజిక బాధ్యతను కూడా మోసుకోవాల్సిన అవసరం మరింత పెరుగుతోంది.



సాంకేతికత అభివృద్ధితో సినిమా పరిధి మరింత విస్తరించింది. డిజిటల్ వేదికల ద్వారా ప్రపంచంలోని ఏ మూలలోనైనా రూపొందిన సినిమా మరో మూలకు చేరగలుగుతోంది. దీంతో సినిమా ప్రభావం మరింత వేగంగా, విస్తృతంగా వ్యాపిస్తోంది. ఈ పరిణామం సినిమాకు కొత్త అవకాశాలను కల్పిస్తున్నప్పటికీ, దాని ప్రభావంపై మరింత ఆలోచన అవసరమని కూడా సూచిస్తోంది. ఒక చిన్న కథ కూడా ప్రపంచవ్యాప్తంగా కోట్ల మందిని ప్రభావితం చేసే స్థాయికి సినిమా చేరుకుంది.

అంతర్జాతీయ సినీ దినోత్సవం సందర్భంగా సినిమాను కేవలం వినోదంగా కాకుండా ఒక సామాజిక శక్తిగా చూడాల్సిన అవసరం ఉంది. లాభాల కోసం మాత్రమే కాకుండా, విలువల కోసం కూడా కథలు చెప్పే దిశగా సినిమా ప్రయాణం సాగాలి. వెండితెరపై కనిపించే కథలు రేపటి తరం ఆలోచనలను మలుస్తాయన్న సత్యాన్ని గుర్తుచేసే రోజే ఈ దినోత్సవం. వినోదాన్ని మించి సందేశాన్ని అందించే సినిమా కొనసాగినప్పుడే సమాజానికి నిజమైన మేలు చేకూరుతుంది.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

## మత స్వేచ్ఛా - సహనం: రాజ్యాంగ వాక్యాలకే పరిమితమా... ప్రజల జీవన విలువగా మారుతుందా?

భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి మత స్వేచ్ఛను మౌలిక హక్కుగా అందించింది. ఎవరి నమ్మకాన్ని వారు అనుసరించుకోవచ్చు, ఎవరి ప్రార్థనను వారు చేయవచ్చు అనే హక్కు ఈ దేశానికి ప్రాణం. అదే సమయంలో ఇతరుల మతాన్ని గౌరవించడం, వారి విశ్వాసాలను కించపరచకుండా ఉండటం కూడా అదే రాజ్యాంగం సూచించిన బాధ్యత. కానీ నేటి సామాజిక పరిస్థితులు చూస్తే, ఈ విలువలు కేవలం రాజ్యాంగ పుస్తకాలలోనే మిగిలిపోతున్నాయా అనే సందేహం తలెత్తుతోంది. మతం అనేది మనిషిని మంచికి నడిపించే మార్గం కావాల్సిన చోట, ద్వేషానికి, విభజనకు కారణంగా మారుతున్న దృశ్యాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

ఇటీవలి కాలంలో మతం పేరుతో రాజకీయ ప్రయోజనాలు సాధించాలనే ప్రయత్నాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రజలను అభివృద్ధి, ఉపాధి, విద్య వంటి అంశాలపై ఏకం చేయాల్సిన పాలక వ్యవస్థలు, మత భావోద్వేగాలను రెచ్చగొట్టి విభజించే దిశగా నడుస్తున్నాయన్న విమర్శలు పెరుగుతున్నాయి. ఒకప్పుడు కలిసి పండుగలు జరుపుకున్న ప్రాంతాలు, నేడు అనుమానంతో చూసుకునే పరిస్థితికి చేరుకుంటున్నాయి. మతం పేరుతో మాటల దాడులు, సోషల్ మీడియా ప్రచారాలు, వర్గాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు సమాజంలో నిశ్శబ్దంగా విషాన్ని నింపుతున్నాయి. ఇది ప్రజాస్వామ్యానికి తీవ్రంగా హానికరమైన పరిణామం.

మత సహనం అనేది బలహీనత కాదు. అది సమాజ బలాన్ని చూపించే లక్షణం. భిన్నమైన ఆలోచనలు, భిన్నమైన విశ్వాసాలు ఉన్నా కూడా కలిసి జీవించగలిగే సామర్థ్యమే నిజమైన నాగరికత. కానీ నేటి పరిస్థితుల్లో 'నాది నిజం %-% నీది తప్పు' అనే భావన బలపడుతోంది. ఇది చివరికి హింసకు, విద్వేషాలకు దారి తీస్తుంది. మత స్వేచ్ఛను కాపాడటం అంటే కేవలం చట్టపరమైన రక్షణ ఇవ్వడం కాదు. అది మన ఆలోచనల్లో, మాటల్లో, ప్రవర్తనలో ప్రతిఫలించాలి. పిల్లలకు పాఠశాలల్లో సహనం విలువ నేర్పించకపోతే, భవిష్యత్ తరాలు మరింత అసహన సమాజంలో పెరిగే ప్రమాదం ఉంది.

ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు, మేధావులు, మీడియా ఈ విషయంలో ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. మతాన్ని రెచ్చగొట్టడం ద్వారా ఓట్లు సంపాదించవచ్చు కానీ శాంతిని కాదు. సమాజాన్ని విభజించడం ద్వారా అధికారాన్ని పొందవచ్చు కానీ దేశాన్ని నిర్మించలేరు. చివరికి మనిషి ముందు మతం కాదు ౦ మనిషే. ఆకలి, బాధ, భయం, ఆశ అన్నీ మతాలకు అతీతమైనవే. ఈ నిజాన్ని అర్థం చేసుకున్న రోజే మత స్వేచ్ఛ, సహనం అనే భావనలు నిజంగా జీవితం అవుతాయి. అధికారికంగా దినంగా గుర్తింపు లేకపోయినా, ఈ విలువలను ఆచరణలో పెట్టిన రోజే మన సమాజానికి నిజమైన పండుగ.భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి మత స్వేచ్ఛను మౌలిక హక్కుగా అందించింది. ఎవరి నమ్మకాన్ని వారు అనుసరించుకోవచ్చు, ఎవరి ప్రార్థనను వారు చేయవచ్చు అనే హక్కు ఈ దేశానికి ప్రాణం. అదే సమయంలో ఇతరుల మతాన్ని గౌరవించడం, వారి విశ్వాసాలను కించపరచకుండా ఉండటం కూడా అదే రాజ్యాంగం సూచించిన బాధ్యత. కానీ నేటి సామాజిక పరిస్థితులు చూస్తే, ఈ విలువలు కేవలం రాజ్యాంగ పుస్తకాలలోనే మిగిలిపోతున్నాయా అనే సందేహం తలెత్తుతోంది. మతం అనేది మనిషిని మంచికి నడిపించే మార్గం కావాల్సిన చోట, ద్వేషానికి, విభజనకు కారణంగా మారుతున్న దృశ్యాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

ఇటీవలి కాలంలో మతం పేరుతో రాజకీయ ప్రయోజనాలు సాధించాలనే ప్రయత్నాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రజలను అభివృద్ధి, ఉపాధి, విద్య వంటి అంశాలపై ఏకం చేయాల్సిన పాలక వ్యవస్థలు, మత భావోద్వేగాలను రెచ్చగొట్టి విభజించే దిశగా నడుస్తున్నాయన్న విమర్శలు పెరుగుతున్నాయి. ఒకప్పుడు కలిసి పండుగలు జరుపుకున్న ప్రాంతాలు, నేడు అనుమానంతో చూసుకునే పరిస్థితికి చేరుకుంటున్నాయి. మతం పేరుతో మాటల దాడులు, సోషల్ మీడియా ప్రచారాలు, వర్గాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు సమాజంలో నిశ్శబ్దంగా విషాన్ని నింపుతున్నాయి. ఇది ప్రజాస్వామ్యానికి తీవ్రంగా హానికరమైన పరిణామం.

మత సహనం అనేది బలహీనత కాదు. అది సమాజ బలాన్ని చూపించే లక్షణం. భిన్నమైన ఆలోచనలు, భిన్నమైన విశ్వాసాలు ఉన్నా కూడా కలిసి జీవించగలిగే సామర్థ్యమే నిజమైన నాగరికత. కానీ నేటి పరిస్థితుల్లో 'నాది నిజం %-% నీది తప్పు' అనే భావన బలపడుతోంది. ఇది చివరికి హింసకు, విద్వేషాలకు దారి తీస్తుంది. మత స్వేచ్ఛను కాపాడటం అంటే కేవలం చట్టపరమైన రక్షణ ఇవ్వడం కాదు. అది మన ఆలోచనల్లో, మాటల్లో, ప్రవర్తనలో ప్రతిఫలించాలి. పిల్లలకు పాఠశాలల్లో సహనం విలువ నేర్పించకపోతే, భవిష్యత్ తరాలు మరింత అసహన సమాజంలో పెరిగే ప్రమాదం ఉంది. ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు, మేధావులు, మీడియా ఈ విషయంలో ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. మతాన్ని రెచ్చగొట్టడం ద్వారా ఓట్లు సంపాదించవచ్చు కానీ శాంతిని కాదు. సమాజాన్ని విభజించడం ద్వారా అధికారాన్ని పొందవచ్చు కానీ దేశాన్ని నిర్మించలేరు. చివరికి మనిషి ముందు మతం కాదు ౦ మనిషే. ఆకలి, బాధ, భయం, ఆశ అన్నీ మతాలకు అతీతమైనవే. ఈ నిజాన్ని అర్థం చేసుకున్న రోజే మత స్వేచ్ఛ, సహనం అనే భావనలు నిజంగా జీవితం అవుతాయి. అధికారికంగా దినంగా గుర్తింపు లేకపోయినా, ఈ విలువలను ఆచరణలో పెట్టిన రోజే మన సమాజానికి నిజమైన పండుగ.

# అదనపు గదుల నిర్మాణం కోసం భూమి పూజ ఎమ్మెల్యే కోట్ల





మన గళంప్యాపిలి పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.58 లక్షల రూపాయల వ్యయంతో అదనపు గదుల నిర్మాణానికి చేపట్టిన భూమి పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరవనీయులు డోన్ శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి హాజరై భూమి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బాలికల విద్యాభివృద్ధే సమాజ పురోగతికి మూలాధారమని, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం వంటి సంస్థలు గ్రామీణ ప్రాంతాల్లో విద్యను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. అదనపు గదుల నిర్మాణంతో విద్యార్థినులకు మెరుగైన వసతులు లభిస్తాయని అన్నారు. అలాగే, పాఠశాలలో విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను డోన్ శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి పరిశీలించి, భోజనం నాణ్యతతో పాటు పరిశుభ్రత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, పాఠశాల సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు కూటమి నాయకులు,కార్యకర్తలు ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఉపాధి హామీ చట్టాన్నికాపాడాలి

- ఎం.జి.ఎన్.ఆర్.ఈ.జి.ఏ రద్దు పేదలపై దాడి-కొత్త బిల్లును వెనక్కి తీసుకోవాలి..సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య.
- జనవరి 18న ఖమ్మంలో శతజయంతి ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయండి.



(ఆలూరు మనగళం) : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది వార్షికోత్సవాలు, 101వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో ఆలూరు పాత బస్టాండ్ వద్ద పార్టీ పతాక ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గిడ్డయ్య మాట్లాడుతూ, దున్నేవాడిదే భూమి అనే ప్రధాన నినాదంతో 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ స్థాపించబడిందని గుర్తు చేశారు. స్వాతంత్ర్యోద్యమంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందని, భూసంస్కరణలు, రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయకరణ వంటి చారిత్రాత్మక పోరాటాలకు సిపిఐ నాయకత్వం వహించిందన్నారు. రైతుకూలీలు, పారిశ్రామిక కార్మికులు, మహిళలు, విద్యార్థులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం నిస్వార్థంగా, నిష్కళంకంగా నిరంతరం ఉద్యమాలు నిర్వహించిన ఘన చరిత్ర సిపిఐదేనన్నారు. ఈ పోరాటాల క్రమంలో వేలాది మంది కమ్యూనిస్టులు జైళ్లకు వెళ్లి చిత్రహింసలు అనుభవించారని, అనేక మంది అమరులైనా వెనక్కి తగ్గలేదని తెలిపారు. ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదంతో భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు వంటి విప్లవవీరులు ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. విశాలాంధ్ర రాష్ట్ర ఏర్పాటు, నైజాం నవాబు వ్యతిరేక పోరాటం, విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేక ఉద్యమాలు, విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమాల్లో వేలాది మంది కమ్యూనిస్టులు త్యాగాలు చేశారని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (%వీ+చీ=జు+ూ%) నుంచి గాంధీజీ పేరును తొలగించడం దుర్మార్గమైన చర్యగా గిడ్డయ్య తీవ్రంగా ఖండించారు. ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి వికసిత్ భారత్ -గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్, ఆజీవిక మిషన్ గ్రామీణ్ పేరుతో కొత్త బిల్లును పార్లమెంట్ ఆమోదించడం పేదల హక్కులపై దాడి చేయడమేనని ఆరోపించారు. కొత్త బిల్లుతో ఉపాధి కూలీలకు ఎలాంటి లాభం లేదని, పని దినాలు సవ్యంగా లేకపోవడం, వేతనాలు తగ్గించడం ద్వారా సగటు కూలీని రూ.260 నుంచి రూ.240కి తగ్గించారని విమర్శించారు. చట్టం అనే పదాన్ని తొలగించి పథకం అనే పదాన్ని వాడడం ద్వారా భవిష్యత్తులో ఉపాధి హామీనే ఎత్తివేసే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ చట్టం తీసుకొచ్చినప్పుడు కేంద్రం 90 శాతం, రాష్ట్రాలు 10 శాతం నిధులు భరించాయని గుర్తు చేశారు. ప్రస్తుతం మోడీ ప్రభుత్వం రాష్ట్రాలపై అదనపు భారం మోపుతూ పేదల పట్ల నియంతృత్వ ధోరణి ప్రదర్శిస్తోందన్నారు. ప్రజలు, మేధావులు, పౌర సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థల అభిప్రాయాలు తీసుకోకుండానే కొత్త బిల్లును ఆమోదించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం ఉపాధి హామీ పథకానికి సుమారు రూ.10 వేల కోట్ల బడ్జెట్ అవసరమవుతుందని, అలాంటి పరిస్థితుల్లో కేంద్రం మోపుతున్న భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎలా భరిస్తుందని ప్రశ్నించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్నందున కేంద్రం చేస్తున్న మోసపూరిత చర్యలను గట్టిగా వ్యతిరేకించి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, కూలీలకు నష్టం కలిగించే కొత్త బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జనవరి 18న ఖమ్మం నగరంలో జరిగే సిపిఐ శతజయంతి ముగింపు ఉత్సవాలను లక్షలాది మందితో జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి రామాంజనేయులు, మండల సహాయ కార్యదర్శి ఎస్.ఎస్. బాషా, ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి రంగన్న, రైతు సంఘం నాయకులు చంద్రకాంత్ రెడ్డి, చాపల గోపాల్, సిద్దేశ్వర కాలనీ శాఖ కార్యదర్శి సిద్ధి లింగ, పెద్ద హొూతూరు శాఖ కార్యదర్శి రాముడు, పుల్లి, దళితుల హక్కుల పోరాట సమితి జిల్లా నాయకుడు రంగన్నతో పాటు పార్టీ, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఆధ్యాత్మిక గ్రంథాలయం ఏర్పాటు

మనగళం శ్రీశైలం : దేవస్థానం నూతనంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీపోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు, పలువురు ధర్మకర్తల మండలి సభ్యులు, ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులు ఈ రోజు (27.12.2025) ప్రారంభించారు. మల్లికార్జునసదన్‌లోని హాల్ నందు ఈ ఆధ్యాత్మిక గ్రంథాలయం ఏర్పాటు చేయబడింది. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీపోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ హిందూ ధర్మప్రచారంలో భాగంగా ఈ ఆధ్యాత్మికగ్రంథాలయం ఏర్పాటు చేయబడిందన్నారు. గ్రంథాలయంలో పురాణాలు, ఇతిహాసాలు, భక్తిసాహిత్యం మొదలైన గ్రంథాలను భక్తులకు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఇంకా వారు మాట్లాడుతూ ప్రస్తుతం గంగాధర మండపం వద్ద గల తిరుపతి సత్రం పాత భవనాన్ని తొలగించి ఆ ప్రదేశంలో ఆధ్యాత్మిక గ్రంథాలయం, మ్యూజియం, గదులను నిర్మించనున్నట్లు తెలియజేశారు. అనంతరం కార్యనిర్వహణాధికారి శ్రీ యం.శ్రీనివాసరావు మాట్లాడుతూ భక్తులలో భక్తిభావాలను మరింతగా పెంపొందించి వారిలో ఆధ్యాత్మిక చింతను కలిగించేందుకు ఈ గ్రంథాలయం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. దశలవారిగా గ్రంథాలయాన్ని విస్తరించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం తిరుమల తిరుపతి దేవస్థానం వారి నుంచి సుమారు 1000కి పైగా గ్రంథాలను పొంది పాఠకులకు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. అదేవిధంగా సుమారు 1400లకు పైగా ఇతర ఆధ్యాత్మిక గ్రంథాలను కూడా గ్రంథాలయంలో అందుబాటులో ఉంచామన్నారు. దాదాపుగా 2,400 పైగా ఆధ్యాత్మిక పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. అలాగే పలువురు ఆధ్యాత్మిక రచయితలు మరియు ఇతర సంస్థల నుంచి ఆధ్యాత్మిక మరిన్ని ఆధ్యాత్మిక గ్రంథాలను పొందేందుకు చర్యలను తీసుకుంటున్నామన్నారు. ఈ గ్రంథాలయంలో దినపత్రికలను, పలు ఆధ్యాత్మిక మాసపత్రికలను కూడా అందుబాటులో ఉంచడం జరుగుతోందన్నారు. స్థానికులు, భక్తులు ఈ గ్రంథాలయ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ధర్మకర్తల మండలి అధ్యక్షులు మరియు కార్యనిర్వహణాధికారివారు కోరారు. కాగా ఈ సందర్భంగా శ్రీశైలక్షేత్రంపై




దేవస్థానం ఇటీవల ప్రచురించిన కాఫీటేబుల్ బుక్కును కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు ధర్మకర్తల మండలి వారికి అందజేశారు. ఈ కార్యక్రమములో ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీ ఎ.వి. రమణ, శ్రీమతి బి. రవణమ్మ, శ్రీ చిట్టిబొట్ల భరద్వాజశర్మ, శ్రీమతి జి. లక్ష్మీశ్వరి, శ్రీమతి జి.గంగమ్మ, శ్రీ శంకరశెట్టి పిచ్చయ్య, శ్రీమతి జె. రేఖాగౌడ్, శ్రీ ఎ. అనిల్‌కుమార్, శ్రీ బి. వెంకటసుబ్బారావు, శ్రీ చిలువేరు కాశీనాథ్, శ్రీ మేడ మురళీధర్, శ్రీమతి జిల్లెల శ్రీదేవి పాల్గొన్నారు. అలాగే ప్రత్యేక ఆహ్వానితులు శ్రీ కె. నాగమల్లేశ్వరరావు, శ్రీ బి. చంద్రమౌళీశ్వరరెడ్డి, శ్రీ కట్టా సుధాకరరెడ్డి, శ్రీ వి. వెంకటేశ్వర్లు, శ్రీ ఎ. శ్రీనివాసులు పాల్గొన్నారు.





# నట్ల కొత్తూరులో వీధిలైటు ఏర్పాటు.



మన గళం సంజామల : నంద్యాల జిల్లా సంజామల మండలం పరిధిలోని నట్ల కొత్తూరు గ్రామంలో సర్పంచ్ యాతం శిరీష పంచాయతీ కార్యదర్శి వెంకటనారాయణ ప్రతి కాలనీలో నూతన వీధిలైట్లు శనివారం ఏర్పాటు చేశారు. దాదాపు 75 వేల రూపాయలు విలువగల లైట్లు, పైపులు , వైర్లు తో 35లైట్లను ఏర్పాటు చేయడం జరిగింది. వీధిలైట్లు వెలగకపోవడంతో వెంటనే స్పందించి సర్పంచ్ చర్యలు తీసుకోవడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. లైన్మెన్ అంబటి పరమేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ధర్మకర్తల మండలి సమావేశం





మనగళం శ్రీశైలం : ఈ రోజు (26.12.2026) దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీపోతుగుంట రమేష్‌నాయుడుగారి అధ్యక్షన ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించబడింది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ధర్మకర్తల మండలి ఎక్స్ అఫిషియో సభ్యులైన శ్రీస్వామివార్ల ప్రధానార్చకులు, ప్రత్యేక ఆహ్వానితులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈనాటి సమావేశంలో మొత్తం 55 అంశాలు చర్చించబడ్డాయి. వీటిలో 47 అంశాలు ఆమోదించబడగా, 2 అంశాలను వాయిదా వేయడం జరిగింది. ఒక అంశం తిరస్కరించబడింది. మరో 5 అంశాలను మరింత కూలంకషంగా చర్చించి తగు నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీపోతుగుంట రమేష్‌నాయుడుగారు తెలియజేశారు.

సమావేశంలో తీసుకోబడిన ముఖ్యమైన నిర్ణయాల గురించి ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీపోతుగుంట రమేష్‌నాయుడు వివరించారు. c రోజురోజుకు పెరుగుతున్న భక్తులరద్దీని దృష్టిలో పెట్టుకుని భక్తుల సౌకర్యార్థం క్యూ కాంప్లెక్సునిర్మాణాన్ని నిర్మించాలని తీర్మానించామన్నారు. ఇందుకు సంబంధించిన ప్లాన్ మరియు అంచనాలను రూపొందించి తదనుగుణంగా చర్యలు తీసుకోబడుతాయన్నారు. c భక్తులలో మరింతగా భక్తిభావాలను పెంపొందింపజేసి వారిలో ఆధ్యాత్మికచింతనను కలిగించేందుకు నక్షత్రవనంలో 150 అడుగుల అర్ధనారీశ్వర విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. వైదిక, శిల్పరంగాలకు చెందిన నిపుణుల సూచనలు సలహాల మేరకు ఈ విగ్రహం రూపొందించ బడుతుందన్నారు.సిమెంటుతో ఈ విగ్రహాన్ని తయారు చేయాలని నిర్ణయించినట్లుగా తెలియజేశారు. c చెంచుగూడాలలో విరివిగా ధర్మప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని తీర్మానించామన్నారు. ఈ ధర్మప్రచార కార్యక్రమాలలో పాల్గొను చెంచు గిరిజనులకు హుండీల ద్వారా వచ్చే వస్త్రాలను ( చీర, పంచెలను) బహూకరించడం జరుగుతుందని కూడా తెలియజేశారు. c హాటకేశ్వరం వద్ద గల దేవస్థానం స్థలంలో విశాలమైన పార్కింగు ప్రదేశం ఏర్పాటు చేయాలని తీర్మానించినట్లుగా తెలియజేశారు. ఈ పార్కింగు ప్రదేశాలలోనే శౌచాలయం వంటి మౌలిక సదుపాయాలను కూడా కల్పించడం జరుగుతుందన్నారు. c శ్రీ భ్రమరాంబాదేవి ఆలయ ప్రవేశద్వార మండపంలో ఒక స్తంభం లోపలివైపుకు కొద్దిగా ఒరిగినట్లుగా కనిస్తుందన్న కారణంగా భద్రతను దృష్టిలో ఉంచుకుని మరియు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకుగాను నిపుణుల సూచనలు అనుసరించి అమ్మవారి రాజగోపుర పునర్నిర్మాణాన్ని చేయాలని తీర్మానించడం జరిగిందన్నారు. ఈ విషయమై ఆయా రంగాలలోని నిపుణుల సలహాలను కూడా తీసుకోవడం జరుగుతుందన్నారు. c శ్రీశైలక్షేత్ర పరిరక్షణలో భాగంగా దేవదాయశాఖ నియమనిబంధనలను అనుసరించి క్షేత్రపరిధిలో అన్యమత ప్రచారం జరగకుండా చూసేందుకు, క్షేత్రంలో మద్యం, మాంసం మొదలైన నిషేధిత వస్తువులు రాకుండా కట్టడి చేసేందుకు ప్రత్యేకంగా దేవస్థానం అధికారులతో విజిలెన్సు కమిటీ ఏర్పాటు చేయాలని తీర్మానించడం జరిగిందన్నారు.c దేవస్థానంలో విధులు నిర్వహించే ఎస్.పి.ఎఫ్ సిబ్బందిని పర్యవేక్షించేందుకు మరియు క్షేత్ర భద్రతా చర్యల పర్యవేక్షణకు డి.ఎస్.పి స్థాయి అధికారిని ఏర్పాటు చేసుకోవాలని తీర్మానించినట్లు తెలియజేశారు. అదేవిధంగా భద్రతా చర్యలలో భాగంగా క్షుణ్ణంగా తనిఖీలు చేసేందుకు బాంబు స్క్వాడ్‌ను కూడా ఏర్పాటు చేసుకోవాలని కూడా తీర్మానించామన్నారు. ఇంకా ధర్మకర్తల మండలి అధ్యక్షులు మాట్లాడుతూ రాబోవు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మరియు ఉగాది మహోత్సవాల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. భక్తులకు ఏ మాత్రం అసౌకర్యం కలగకుండా వుండేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా క్షేత్రాన్ని దర్శించే సామాన్య భక్తులకు మరియు మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు.

# ఆన్‌లైన్ ద్వారా అధిక మొత్తంలో రాబడి

మనగళం శ్రీశైలం : వరుస సెలవులు కావడంతో అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శిస్తున్న భక్తులు c గతంలో ఎన్నడూ లేనంతగా భారీస్థాయిలో ఆన్‌లైన్ ద్వారా రాబడి c భక్తుల సౌకర్యార్థం విస్తృతంగా ఏర్పాట్లు చేసిన దేవస్థానంరాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దేవస్థానం ఆన్‌లైన్ విధానాన్ని విస్తృతంగా అమలు చేస్తోందని ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్‌నాయుడు మరియు కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. ఈ ఆన్‌లైన్ ద్వారా భక్తులు శ్రీస్వామివారి స్పర్శదర్శనం, రూ. 300ల అతిశీఘ్రదర్శనం, రూ. 150/-ల శీఘ్రదర్శనంటికెట్లను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. అదేవిధంగా మొత్తం 14 ఆర్జితసేవలకు సంబంధించిన సేవాటికెట్లు కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచడం జరిగిందని పేర్కొన్నారు. 'మనమిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ 95523 00009 ద్వారా కూడా దర్శనం మరియు ఆర్జితసేవలు పొందే అవకాశం కల్పించబడిందన్నారు. కాగా నిన్నటిరోజున ( 26.12.2025) ఈ ఆన్‌లైన్ ద్వారా దేవస్థానానికి రూ. 73,19,314.00లు రాబడిగా లభించింది. ఆన్‌లైన్ ద్వారా ఇంత భారీ మొత్తంలో దేవస్థానానికి రాబడిగా లభించడం ఇదే మొదటిసారి కావడం విశేషమని వారు పేర్కొన్నారు. నిన్నటి ( 26.12.2025) రోజున ఆన్‌లైన్ ద్వారా మొత్తం 12000 ట్రాన్సాక్షన్సు జరిగాయన్నారు. ఒకేరోజున ఇన్ని ట్రాన్సక్షన్స్ జరగడం ఇదే మొదటిసారి అన్నారు. దర్శనాలు, లడ్డుప్రసాదాలు, ఆర్జిత అభిషేకాలు, ఇతర ఆర్జితసేవలు, విరాళాలు, కేశఖండనం మొదలైనవాటి ద్వారా ఈ రాబడి లభించిందన్నారు. అదేవిధంగా ఆఫ్‌లైన్ ద్వారా కూడా రూ. 73,75,511.00లు రాబడిగా రావడం జరిగిందన్నారు. ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ ద్వారా నిన్నటి రోజున మొత్తం రూ. 1,46,94,825.00లు రాబడిగా రావడం జరిగిందని వారు తెలియజేశారు. సాధారణ రోజులలో ఇంత అధికమొత్తంలో రికార్డుస్థాయిలో రాబడి రావడం జరిగిందన్నారు. కాగా భక్తులరద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం పలు ఏర్పాట్లు కూడా చేసిందని పేర్కొన్నారు. ప్రణాళికబద్ధంగా క్యూలైన్లు నిర్వహించడం జరిగిందన్నారు. దాదాపుగా దేవస్థానం సిబ్బందికంతా కూడా ప్రత్యేక విధులను కేటాయించామన్నారు. అదేవిధంగా క్యూకాంప్లెక్సు, దర్శనం క్యూలైన్లు, అన్నప్రసాదవితరణ మొదలైనచోట్ల శివసేవకుల స్వచ్ఛందసేవలను కూడా విస్తృతంగా వినియోగించుకోవడం జరిగిందని పేర్కొన్నారు.

భక్తుల సౌకర్యార్థమై క్షేత్రపరిధిలో ఆన్‌లైన్ నమోదు సహాయ కేంద్రాలను



కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నందిగుడి దగ్గర, రథశాల వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన విరాళాల సేకరణ కేంద్రం, క్యూలైన్ ప్రవేశద్వారం ఎదురుగా మరియు పాత విరాళాల కేంద్రం వద్ద ఈ సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయన్నారు. దేవస్థానం కల్పిస్తున్న ఆన్‌లైన్ సేవలను భక్తులు విరివిగా వినియోగించుకోవాలని ధర్మకర్తల మండలి అధ్యక్షులు మరియు కార్యనిర్వహణాధికారివారు ఈ సందర్భంగా తెలియజేశారు.

# టమోటా ధరలు ఫుల్ జోష్.. కిలో రూ.46 వరకు రేటు

హైదరాబాద్ డిసెంబర్ 27, 2025 మనగళం : అనంతపురం జిల్లాలో టమోటా రైతులకు ఊరటనిచ్చే పరిస్థితులు ఏర్పడ్డాయి. కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో గత వారం రోజులుగా ధరలు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. ప్రస్తుతం కిలో టమోటాకు రూ.40కు పైగానే ధర లభిస్తుండగా, శుక్రవారం గరిష్ఠంగా రూ.46 వరకు ధర నమోదైంది. ఈ రేట్లు రైతుల్లో కొత్త ఆశలను రేకెత్తిస్తున్నాయి.మార్కెట్ వర్గాల ప్రకారం ఇటీవలి రోజులలో టమోటా దిగుబడులు గణనీయంగా తగ్గాయి. వాతావరణ మార్పులు, సాగు విస్తీర్ణం తగ్గడం కారణంగా ఉత్పత్తి తక్కువగా ఉండటంతో సరఫరాలో లోటు ఏర్పడింది. అదే సమయంలో ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు టమోటా ఎగుమతులు కొనసాగుతుండటంతో డిమాండ్ పెరిగింది. దీంతో కక్కలపల్లి మార్కెట్‌లో కొనుగోలుదారులు పోటీగా ధరలు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది.ధరలు పెరగడంతో రైతులు పంటను వేగంగా మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. అయితే రాబోయే రోజుల్లో దిగుబడులు పెరిగితే ధరల్లో మార్పులు వచ్చే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మాత్రం టమోటా సాగు చేసిన రైతులకు ఇది లాభదాయక దశగా కొనసాగుతోందని వ్యవసాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



# ఉపాధిహామీ పథకంలో మహాత్మా గాంధీ పేరును కొనసాగించాలి

**– ఏపీ వ్యవసాయకార్మికసంఘం డిమాండ్**

మన గళం సి.బెళగల్: కర్నూలు జిల్లా సి.బెళగల్ మండలంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరును తొలగించడాన్ని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో బెళగల్ మండలం పోలకల్ గ్రామ సచివాలయం దగ్గర శనివారం నిరసన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ అధ్యక్షులు హనుమంతు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి శేషుకుమార్, గూడూరు సిపిఐ మండల కార్యదర్శి బీడీల శ్రీనివాసులు,ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం కోడుమూరు పట్టణ కార్యదర్శి రామాంజనేయులు లు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మాగాంధీ,సిపిఐ పార్టీ అనేక పోరాటాలు, ప్రాణ త్యాగాలు చేసిన ఘనత ఏపీ వ్యవసాయ కార్మిక సంఘానికి ఉందన్నారు. అలాంటి మహాత్మా గాంధీ పేరును కేంద్ర ప్రభుత్వం తొలగించడం దారుణమన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి రు 4,165,000 కోట్లు కేటాయిస్తే నేడు మోదీ ప్రభుత్వం తూ తూ మంత్రంగా నిధులు విడుదల చేస్తూ, పేరు మార్పు చేస్తూ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేయడానికి పన్నాగాలు చేస్తోందని విమర్శించారు. దేశానికి గ్రామసీమలే పట్టుకొమ్మలు అని చెప్పే నాయకులు గ్రామాల్లో వ్యవసాయ కార్మికులకు మూడు పూటలా పట్టేడన్నం పెట్టె ఉపాధి హామీ పథకానికి ప్రధాని మోదీ పంగణామాలు పెట్టే ఆలోచనతోనే కేంద్రం 60% నిధులు విడుదల చేస్తే, రాష్ట్రం 40% నిధులు కేటాయించాలని చెప్పి చేతులు దులుపుకోవాలని చూస్తోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లోటు బడ్జెట్లో ఉందని అటువంటి సమయంలో కేంద్రం రాష్ట్రాలకు 40% నిధులు కేటాయించడని ఆంధ్ర రాష్ట్రానికి చెప్పడం సిగ్గుచేటని వారు







విమర్శించారు. కేంద్రంలో అధికారం వెలగబెడుతున్న బీజేపీ ప్రభుత్వానికి మద్దతుగా వున్న కూటమి ప్రభుత్వాం ఎన్నికల సమయంలో ఇండ్ల స్థలాలు లేని పేదలకు ఇండ్లు ఇస్తామని, గృహాలు లేనివారికి ప్రభుత్వ గృహాలు మంజూరు చెయ్యాలని, ఉపాధిహామీ కార్మికులకు వేతనం రు 300/ నుండి 600/ వందలు పెంచాలని,ఉపాధి హామీ పని సంవత్సరానికి 100 రోజులనుండి 200 రోజులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్ లతో కూడిన వినతిపత్రాన్ని సచి వాలయం కార్యదర్శి సిద్దుకి అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలకల్ గ్రామ ఏపీ వ్య కా సంఘం నాయకులు సిద్దు, వీరశేఖర్, పవన్ కళ్యాణ్, రాజు, అశోక్ కుమార్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# బంపర్ ఆఫర్ అంటే ఇదే..




హైదరాబాద్ డిసెంబర్ 27, 2025 మనగళం, : సంవత్సరం ముగింపు వేళ కార్ల మార్కెట్‌లో మహీంద్రా కంపెనీ వినియోగదారులకు అదిరిపోయే ఆఫర్‌తో ముందుకొచ్చింది. అమ్మకాలను పెంచడం, 2025 మోడల్ స్టాక్‌ను క్లియర్ చేయడం లక్ష్యంగా ఈ నెలాఖరు వరకు తన ప్రముఖ ఎస్‌యూవీలపై భారీ డిస్కౌంట్లను ప్రకటించింది. ముఖ్యంగా మహీంద్రా ఎక్స్‌యూవీ 400పై కంపెనీ ఇస్తున్న ఆఫర్ చూస్తే నిజంగా బంపర్ డీల్ అనే చెప్పాలి.ప్రస్తుతం మహీంద్రా ఎక్స్‌యూవీ 400పై గరిష్ఠంగా రూ.4.45 లక్షల వరకు తగ్గింపు అందుబాటులో ఉంది. ఇది ఈ మోడల్‌పై ఇప్పటివరకు ప్రకటించిన అత్యధిక డిస్కౌంట్‌గా నిలుస్తోంది. ఈ ఆఫర్‌లో నగదు తగ్గింపు, ఎక్స్ఛేంజ్ బోనస్, లాయల్టీ ప్రయోజనాలు, కార్పొరేట్ ఆఫర్లు, ఇన్సూరెన్స్ బెనిఫిట్స్ ఉన్నాయి. అయితే ఇవి వేరియంట్, ప్రాంతం, డీలర్‌ను బట్టి మారే అవకాశం ఉందని కంపెనీ వర్గాలు చెబుతున్నాయి.మహీంద్రా ఎక్స్‌యూవీ 400 ధర విషయానికి వస్తే, ఈ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ప్రారంభ ధర రూ.15.49 లక్షలుగా ఉంది. డిసెంబర్‌లో ఈ కారును కొనుగోలు చేస్తే లక్షల రూపాయల వరకు లాభం పొందే అవకాశం ఉంది. ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనం కొనాలనుకునే వారికి ఇది మంచి సమయంగా మారింది.ఎక్స్‌యూవీ 400తో పాటు మహీంద్రా ఇతర ఎస్‌యూవీలపైనా డిస్కౌంట్లు అందిస్తోంది. ఎక్స్‌యూవీ 3ఎక్స్ఓపై రూ.1.14 లక్షల వరకు, స్కార్పియో క్లాసిక్‌పై రూ.1.40 లక్షలు, స్కార్పియో ఎన్‌పై రూ.85,600, థార్ రాక్‌పై రూ.1.20 లక్షలు, ఎక్స్‌యూవీ 700పై రూ.1.55 లక్షల వరకు తగ్గింపులు ఉన్నాయి.మొత్తంగా చూస్తే, డిసెంబర్ 31 వరకు మాత్రమే ఈ ఆఫర్లు అందుబాటులో ఉండటంతో మహీంద్రా ఎస్‌యూవీ కొనాలని భావిస్తున్న వారికి ఇది అరుదైన అవకాశంగా చెప్పుకోవచ్చు. భారీ డిస్కౌంట్లతో కొత్త సంవత్సరం ముందు కొత్త కారు ఇంటికి తీసుకెళ్లే ఛాన్స్‌ను వినియోగదారులు ఉపయోగించుకుంటున్నారు.

# ఆస్పత్రిలో బాధితులను పరామర్శించిన వైయస్సార్సీపి ఇన్చార్జి ఆదిమూలపు సతీష్

**– కోడుమూరు నియోజకవర్గ వైయస్సార్సీపి ఇన్చార్జి ఆదిమూలపు సతీష్**





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు బాధితులు అనారోగ్యంతో బాధపడుతూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని కోడుమూరు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ పరామర్శించారు. ఆనుగొండ గ్రామానికి చెందిన పింజరి కమల్ అనే వ్యక్తి అప్పుల బాధ తట్టుకోలేక విషయం తాగి ఆసుపత్రిలో చేరడం జరిగింది ఈ విషయాన్ని వైసిపి నాయకులు రాజారెడ్డి ద్వారా తెలుసుకొని ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. అలాగే ముడుమలగుర్తి గ్రామానికి చెందిన అయ్యన్న నరాల సమస్యతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం చేరారని విషయాన్ని మహేశ్వర్ ద్వారా తెలుసుకొని ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి మనోధైర్యాన్ని ఇచ్చారు



# కొత్త ఏడాదిలో ఆఫీస్‌కు వెళ్లడం తప్పదా?

హైదరాబాద్ డిసెంబర్ 27, 2025 మనగళం, : కోవిడ్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా పని సంస్కృతిలో అతిపెద్ద మార్పుగా వచ్చిన ఇంటి నుంచే పని విధానం ఇప్పుడు క్రమంగా తగ్గుముఖం పడుతోంది. 2025 నాటికి ఈ విధానానికి పెద్ద ఎత్తున బ్రేక్ పడుతున్న స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. అనేక ప్రముఖ కార్పొరేట్ సంస్థలు ఉద్యోగులను మళ్లీ పూర్తిస్థాయిలో కార్యాలయాలకు రావాలని ఆదేశాలు జారీ చేస్తున్నాయి.ఈ ఏడాది ఆరంభంలోనే అమెజాన్ తన ఉద్యోగులు వారానికి ఐదు రోజులు తప్పనిసరిగా కార్యాలయానికి హాజరు కావాలని స్పష్టం చేసింది. అదే బాటలో డెల్, ఐబిఎం, మెటా, గూగుల్, మైక్రోసాఫ్ట్, ఆపిల్, సేల్స్‌ఫోర్స్, స్నాప్ వంటి టెక్ దిగ్గజాలు కూడా రిటర్న్ టు ఆఫీస్ విధానాన్ని కఠినంగా అమలు చేస్తున్నాయి. ఆర్థిక రంగంలో గోల్డ్‌మన్ సాక్స్, జేపీ మోర్గాన్, మోర్గాన్ స్టాన్లీ ఇప్పటికే కార్యాలయ పనికే ప్రాధాన్యం ఇస్తున్నాయి. వినోద రంగంలో డిస్నీ, టెలికాం రంగంలో ఏటీ అండ్ టి కూడా ఇదే దిశగా అడుగులు వేస్తున్నాయి.ఇక మెటా గ్రూప్‌కు చెందిన ఇన్‌స్టాగ్రామ్ అధిపతి ఆడమ్ మోస్సేరీ తాజాగా చేసిన ప్రకటన ఈ మార్పును మరింత బలపరిచింది. ఫిబ్రవరి 2 నుంచి అమెరికాలోని ఉద్యోగులందరూ పూర్తిస్థాయిలో కార్యాలయాలకు తిరిగి రావాలని కంపెనీ నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. దీని ద్వారా ఇంటి నుంచే పని విధానానికి మెటా ఎంతవరకు ముగింపు పలుకుతోందో స్పష్టమవుతోంది.ప్రపంచంలోని అతిపెద్ద నియామక సంస్థల్లో ఒకటైన రాండ్‌స్టాడ్ గ్లోబల్ అధిపతి సాండర్ వాంట్ నూర్డెండే మాట్లాడుతూ, కార్యాలయాలకు తిరిగి రావాలన్న అంశంపై సాగిన చర్చలు ఇప్పుడు ముగింపు దశకు వచ్చాయని తెలిపారు. ఇకపై పూర్తిస్థాయి ఇంటి నుంచే ఉద్యోగాలు సాధారణ ఉద్యోగులకు కాకుండా అరుదైన నైపుణ్యాలు, అసాధారణ ప్రతిభ ఉన్నవారికే పరిమితమవుతాయని స్పష్టం చేశారు.కార్న్ ఫెర్రీ తాజా నివేదిక కూడా ఇదే విషయాన్ని నొక్కిచెబుతోంది. భవిష్యత్తులో మిశ్రమ విధానం కొనసాగినా, సౌలభ్యం ప్రతి ఉద్యోగికి దక్కే హక్కుగా కాకుండా టాప్ ప్రతిభ ఉన్నవారికే ఇచ్చే ప్రత్యేక అవకాశంగా మారనుందని అంచనా వేసింది. సులభంగా భర్తీ చేయగల ఉద్యోగాల్లో ఉన్నవారు తప్పనిసరిగా కార్యాలయానికి రావాల్సిందేనని కంపెనీలు స్పష్టం చేస్తున్నాయి.మొత్తం మీద ఐదేళ్ల పాటు కొనసాగిన ఇంటి నుంచే పని ప్రయోగం తర్వాత, 2025తో కార్పొరేట్ ప్రపంచం మళ్లీ కార్యాలయ కేంద్రిత పనితీరుకు తిరిగి వస్తోంది. ఇంటి నుంచే పని విధానానికి శాశ్వత వీడ్కోలు పలికే దశకు ప్రపంచ ఉద్యోగ రంగం చేరుకుందని పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# ఒకటి కంటే ఎక్కువ పీఎఫ్ ఖాతాలున్నాయా?




హైదరాబాద్ డిసెంబర్ 27, 2025 మనగళం, : ఉద్యోగాలు మారే సమయంలో చాలామంది తమ పాత పీఎఫ్ ఖాతా వివరాలను కొత్త సంస్థకు ఇవ్వకపోవడంతో ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ పీఎఫ్ ఖాతాలు ఏర్పడుతున్నాయి. ఇది చిన్న విషయంలా కనిపించినా, భవిష్యత్తులో వడ్డీ నష్టం, పన్ను సమస్యలు, ఉపసంహరణ సమయంలో ఆటంకాలకు దారి తీసే అవకాశం ఉంది. ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ సంస్థ నిబంధనల ప్రకారం ప్రతి ఉద్యోగికి ఒకే యూనివర్సల్ అకౌంట్ నంబర్ మాత్రమే ఉండాలి. అందుకే ఒకటి కంటే ఎక్కువ పీఎఫ్ ఖాతాలు ఉన్నవారు తప్పనిసరిగా వాటిని విలీనం చేసుకోవాల్సిన అవసరం ఉంది.సాధారణంగా ఉద్యోగి ఉద్యోగం మారినప్పుడు పాత యూనివర్సల్ అకౌంట్ నంబర్‌ను తెలియజేయకపోతే కొత్త యజమాని మరో నంబర్‌ను సృష్టిస్తాడు. అలాగే ఆధార్, పాన్ వివరాల్లో తేడాలు, పేరు లేదా పుట్టిన తేదీ సరిపోలకపోవడం, మునుపటి సంస్థ నిష్క్రమణ తేదీని నమోదు చేయకపోవడం వంటివి కూడా కొత్త అకౌంట్ ఏర్పడటానికి కారణమవుతాయి. ఇలా ఏర్పడిన అదనపు ఖాతాలు మూడేళ్లకు పైగా నిష్క్రియంగా ఉంటే వాటిపై వడ్డీ ఆగిపోవచ్చు. అలాగే ఐదు సంవత్సరాల నిరంతర సేవ నిరూపణ కష్టమై పన్ను భారం పెరిగే ప్రమాదం ఉంది.విలీనానికి ముందుగా ఆధార్, పాన్, పీఎఫ్ రికార్డుల్లో పేరు, పుట్టిన తేదీ, లింగం పూర్తిగా సరిపోతున్నాయా లేదా తనిఖీ చేసుకోవాలి. ఆధార్ సీడింగ్, ధృవీకరణ పూర్తిగా ఉండాలి. మునుపటి యజమాని నిష్క్రమణ తేదీని సరిగ్గా నమోదు చేశాడా లేదా కూడా చూసుకోవాలి. ఇవన్నీ సరిగా లేకపోతే విలీనం తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంటుంది.పీఎఫ్ ఖాతాల విలీనం కోసం ఆన్‌లైన్ విధానం అందుబాటులో ఉంది. ఏకీకృత పోర్టల్‌లో లాగిన్ అయి 'వన్ మెంబర్ వన్ పీఎఫ్ అకౌంట్' ఎంపికను ఎంచుకుని, వ్యక్తిగత వివరాలను ధృవీకరించాలి. అనంతరం పాత అకౌంట్ వివరాలు నమోదు చేసి, ప్రస్తుత లేదా మునుపటి యజమాని ధృవీకరణకు పంపాలి. దరఖాస్తు సమర్పించిన తర్వాత ట్రాకింగ్ నంబర్ ద్వారా స్థితిని తెలుసుకోవచ్చు. పోర్టల్ పనిచేయని సందర్భాల్లో ప్రస్తుత, పాత యూనివర్సల్ అకౌంట్ నంబర్లు, ఆధార్ ప్రకారం పేరు, నమోదు చేసిన మొబైల్ నంబర్‌తో ఈమెయిల్ ద్వారా కూడా అభ్యర్థన పంపవచ్చు.సాధారణంగా విలీన ప్రక్రియ పూర్తవడానికి 20 నుంచి 30 రోజులు పడుతుంది. విలీనం పూర్తయిన తర్వాత పాత అకౌంట్ నిష్క్రియంగా మారి, మొత్తం పీఎఫ్ నిల్వ ఒకే క్రియాశీల అకౌంట్‌కు జత అవుతుంది. సమస్యలు రాకముందే పీఎఫ్ ఖాతాలను విలీనం చేసుకోవడం ఉద్యోగులకు ఆర్థిక భద్రతను కల్పిస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

# బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోండి

**– జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : ఎలక్షన్ కమిషన్ నిబంధనల మేరకు రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను (బీఎల్ఏ) వెంటనే నియమించుకోవాలని, ప్రస్తుతం జరుగుతున్న మార్పులు, చేర్పుల విషయాల్లో బీఎల్ఓ లకు సహకరించాలని కర్నూలు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.ఏ.సిరి రాజకీయ పార్టీ ప్రతినిధులకు సూచించారు. శనివారం కలెక్టర్ తన ఛాంబర్ లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించేందుకు బీఎల్ఓలతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఓటర్ల జాబితాలో అస్పష్టమైన, సంబంధం లేని ఫోటోలు, అసంబద్ధమైన నమోదులను తొలగించడం లో బూత్ లెవల్ ఏజెంట్లు బీఎల్ఓలకు సహకరించాలని కలెక్టర్ రాజకీయ పార్టీ ప్రతినిధులను కోరారు. ఓటర్ల మ్యాపింగ్ లో కర్నూలు జిల్లా రాష్ట్రం లో 14వ స్థానంలో 47.90శాతంతో ఉందని, జనవరి చివరి నాటికి గ్రామీణ ప్రాంతాల్లో 75శాతం, పట్టణ ప్రాంతాల్లో 85శాతం మ్యాపింగ్ జరిగే లాగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సరిగా పనిచేయని ఇద్దరు బీఎల్ఓ లను సస్పెండ్ చేశామని, తప్పులు చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. బీఎల్ఓల జాబితాను రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఇవ్వాలని, అలాగే బూత్ లెవెల్ ఏజెంట్ల వివరాలు కూడా రాజకీయ పార్టీల నుండి సేకరించుకోవాలని సూచించారు. డీఆర్ఓ వెంకట నారాయణమ్మ మాట్లాడుతూ ఓటర్లు నమోదు కొరకు నిర్దేశించిన ఫారం తో పాటు మంచి కలర్ ఫోటోలను సమర్పించాలని, జూనియర్ కాలేజీ ల్లో 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులను క్రొత్త ఓటర్లు గా నమోదు చేసుకునే చర్యలు



చేపడతామని రాజకీయ పార్టీ ప్రతినిధులకు తెలియజేశారు. అంతకు ముందు కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు త్రైమాసిక తనిఖీలో భాగంగా కలెక్టరేట్ లో ఉన్న ఈవీఎం గోడౌన్ ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. అక్కడ చేపడుతున్న భద్రతా చర్యలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. సమావేశంలో బహుజన సమాజ్ వాదీ పార్టీ డిస్ట్రిక్ట్ ఇంచార్జ్ అరుణ్ కుమార్, తెలుగుదేశం పార్టీ తరఫున గట్టు అన్వేష్, జనసేన పార్టీ తరఫున తల్లా మంజునాథ్ (వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్), బీజేపీ తరఫున పీటీ సాయి ప్రదీప్, కాంగ్రెస్ పార్టీ తరఫున బజారన్న, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.

# డిసెంబర్ 31న పింఛన్ పంపిణీ చేయాలి

**– కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**




మనగళం, కర్నూలు సిటీ : జనవరి 1, 2026 వ తేదీన పంపిణీ చేయాల్సిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ను డిసెంబర్ 31 వ తేదీ నే పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. శనివారం ఎంపీడీఓ లు, మునిసిపల్ కమిషనర్లు, పెన్షన్ పంపిణీ అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 30 వ తేదీనే పెన్షన్ మొత్తాన్ని డ్రా చేసి సేఫ్ కస్టడీ లో ఉంచుకుని, 31 వ తేదీన ఉదయం 6.30 గంటల నుంచి పింఛనుదారులకు పంపిణీ చేయాలని ఆదేశించారు. డిసెంబర్ 31న వంద శాతం ఫించన్లను పంపిణీ చేయాలన్నారు. అందుకనుగుణంగా ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాలన్నారు. పింఛనుదారుల ఇంటివద్దకే వెళ్ళి పెన్షన్లు పంపిణీ చేయాలన్నారు. ఏ కారణం చేతనైనా ఇంటివద్ద ఇవ్వడం కుదరకపోతే, తగిన కారణాలను యాప్ లో నమోదు చేయాలన్నారు. పెన్షన్ పంపిణీ అధికారులు పెన్షన్ దారులతో గౌరవ ప్రదంగా వ్యవహరించాలని, అవినీతికి పాల్పడరాదని కలెక్టర్ ఆదేశించారు. అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. అలాగే డిసెంబర్ 31 వ తేదీన పెన్షన్ తీసుకోని లబ్ధిదారులకు జనవరి 2 వ తేదీన పెన్షన్లను పంపిణీ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్ లో డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమణా రెడ్డి, జడ్పీ సీఈవో నాసర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ మ్యాచ్ చూస్తూ మైదానంలోనే ప్రాణాలు విడిచిన కోచ్ మహబూబ్ అలీ జకీ

హైదరాబాద్ డిసెంబర్ 27, 2025 మనగళం, : క్రికెట్ మైదానంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ పోటీల సందర్భంగా ఢాకా క్యాపిటల్స్ జట్టు అసిస్టెంట్ కోచ్ మహబూబ్ అలీ జకీ 50 ఏళ్ల వయసులో హఠాత్తుగా మరణించారు. సిల్హెట్ అంతర్జాతీయ మైదానంలో శనివారం జరగాల్సిన మ్యాచ్‌కు ముందు పిచ్ పరిశీలన చేసిన జకీ, ఆపై స్టాండ్స్‌లో కూర్చొని మ్యాచ్‌ను వీక్షిస్తుండగా అకస్మాత్తుగా కుప్పకూలిపోయారు. ఈ ఘటనతో మైదానంలో ఉన్న ఆటగాళ్లు, సహాయక సిబ్బంది ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు.అలీ కిందపడిన వెంటనే వైద్య బృందం స్పందించి సీపీఆర్ ద్వారా ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించింది. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆయనను అంబులెన్స్‌లో సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయాన్ని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చీఫ్ ఫిజీషియన్ డెబాషిశ్ చౌదరీ మీడియాకు వెల్లడించారు. జకీకి గతంలో ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని, ఈ అకాల మరణం తమను తీవ్రంగా కలచివేసిందని ఆయన తెలిపారు.మాజీ పేసర్ అయిన మహబూబ్ అలీ జకీ, ఆట నుంచి వీడ్కోలు తీసుకున్న అనంతరం కోచ్‌గా తనదైన ముద్ర వేశారు. 2008లో హై పెర్ఫార్మెన్స్ కోచ్‌గా బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డులో చేరిన ఆయన, యువ పేసర్లకు శిక్షణ ఇచ్చి పేరు సంపాదించారు. ముఖ్యంగా సీనియర్ పేసర్ తస్కిన్ అహ్మద్ ఎదుగుదలలో జకీ కీలక పాత్ర పోషించినట్లు క్రికెట్ వర్గాలు గుర్తుచేస్తున్నాయి. ఆయన ఆకస్మిక మరణం



బంగ్లా క్రికెట్‌కు తీరని లోటు అని విశ్లేషకులు, మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు.జకీ మృతిపట్ల ఢాకా క్యాపిటల్స్ జట్టు, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు తీవ్ర సంతాపం ప్రకటించాయి. మ్యాచ్‌కు ముందు ఉత్సాహంగా ఉన్న జట్టు ఒక్కసారిగా విషాదంలో మునిగిపోయింది. మైదానంలోనే ఓ కోచ్ ప్రాణాలు కోల్పోవడం క్రికెట్ అభిమానులను కూడా కలచివేసింది.

# కోహ్లీని దాటేసిన కుర్రాళ్లు..



హైదరాబాద్ డిసెంబర్ 27, 2025 మనగళం, : దేశవాళీ క్రికెట్‌లో ప్రస్తుతం విజయ్ హజారే ట్రోఫీ అభిమానులను ఉర్రూతలూగిస్తోంది. టీమిండియా దిగ్గజం విరాట్ కోహ్లీ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 208 పరుగులు చేసి అద్భుత ఫామ్‌లోకి వచ్చినప్పటికీ, ఈ టోర్నీలో ఐదుగురు యువ ఆటగాళ్లు అతడిని కూడా దాటేస్తూ పరుగుల వరద పారిస్తున్నారు. అనుభవం, పేరు ప్రతిష్ట ఉన్న ఆటగాళ్లకే సవాల్ విసురుతూ ఈ కుర్రాళ్లు బ్యాట్‌తో వీరబాదుడు బాదుతున్నారు.కర్ణాటక ఓపెనర్ దేవదత్ పడిక్కల్ ఈ టోర్నీలో అసాధారణ ఫామ్‌లో ఉన్నాడు. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ వరుసగా రెండు సెంచరీలు బాది మొత్తం 271 పరుగులతో పరుగుల పట్టికలో అగ్రస్థానంలో నిలిచాడు. సగటు 135.50తో పాటు దూకుడైన ఆటతీరుతో ప్రత్యర్థి బౌలర్లకు నిద్ర లేకుండా చేస్తున్నాడు. విదర్భ బ్యాటర్ ధ్రువ్ షోరే కూడా ఏమాత్రం తగ్గకుండా రెండు ఇన్నింగ్స్‌ల్లో రెండు సెంచరీలు బాది 245 పరుగులు సాధించాడు. ఒక ఇన్నింగ్స్‌లో నాటౌట్‌గా నిలవడం వల్ల అతని సగటు 245గా ఉండటం విశేషంగా మారింది.సౌరాష్ట్ర తరఫున ఆడుతున్న సమర్ గజ్జర్ నిలకడైన ఆటతో జట్టుకు కీలకంగా మారాడు. రెండు మ్యాచ్‌ల్లో ఒక సెంచరీ, ఒక అర్ధ సెంచరీతో 215 పరుగులు చేసి మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. ఉత్తరప్రదేశ్ వికెట్ కీపర్ బ్యాటర్ ఆర్యన్ జుయల్ కూడా తన దూకుడు బ్యాటింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షించాడు. రెండు మ్యాచ్‌ల్లో 214 పరుగులు చేసి నాలుగో స్థానంలో నిలిచిన అతడు ఒక సెంచరీ, ఒక అర్ధ సెంచరీతో బౌండరీల వర్షం కురిపించాడు. ఒడిశా యువ బ్యాటర్ స్వస్తిక్ పీపీ సమల్ తొలి మ్యాచ్‌లోనే డబుల్ సెంచరీ బాది సంచలనం సృష్టించాడు. రెండో మ్యాచ్‌లో ఖాతా తెరవకపోయినా తొలి మ్యాచ్‌లో చేసిన భారీ పరుగుల వల్ల మొత్తం 212 పరుగులతో టాప్ 5లో చోటు దక్కించుకున్నాడు.ఏది ఏమైనా విరాట్ కోహ్లీ సాధించిన 208 పరుగుల మార్కును ఈ ఐదుగురు యువ ఆటగాళ్లు అధిగమించడం దేశవాళీ క్రికెట్‌లో కొత్త తరం దూకుడును స్పష్టంగా చూపిస్తోంది. భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయిలోనూ వీరే టీమిండియాకు కీలకంగా మారతారన్న ఆశలను ఈ ప్రదర్శనలు మరింత బలపరుస్తున్నాయి.

# కెనడాలో తొలి క్రికెట్ అకాడమీ ప్రారంభించిన ఢిల్లీ క్యాపిటల్స్

హైదరాబాద్ డిసెంబర్ 27, 2025 మనగళం, : : ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ అంతర్జాతీయ స్థాయిలో తన క్రికెట్ కార్యకలాపాలను వేగంగా విస్తరిస్తోంది. ఇప్పటికే లండన్‌లో అంతర్జాతీయ క్రికెట్ అకాడమీని నిర్వహిస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ తాజాగా ఉత్తర అమెరికా ఖండంలో అడుగుపెట్టింది. కెనడాలోని అంటారియో రాష్ట్రం మిస్సిసాగా నగరంలో తమ తొలి క్రికెట్ అకాడమీని అధికారికంగా ప్రారంభించింది. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఇది రెండో అంతర్జాతీయ అకాడమీగా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ వేగంగా విస్తరిస్తున్న దేశాలలో కెనడా ఒకటిగా ఉండటంతో అక్కడి యువ ప్రతిభను గుర్తించి తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ అడుగు వేసినట్లు ఫ్రాంచైజీ తెలిపింది.ఈ అకాడమీ ద్వారా స్థానిక యువ క్రికెటర్లకు భారతదేశంలో అమలవుతున్న ఉన్నత ప్రమాణాల శిక్షణను అందించనున్నారు. ఇందుకోసం అంటారియో క్రికెట్ అకాడమితో ఢిల్లీ క్యాపిటల్స్ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. 2026 జనవరిలో ట్రయల్స్ నిర్వహించి ప్రతిభావంతులైన ఆటగాళ్లను ఎంపిక చేసి పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌తో పాటు శారీరక దృఢత్వం, మానసిక బలం పెంపొందించే విధంగా శిక్షణ కార్యక్రమాలు రూపొందించినట్లు సమాచారం.ఈ సందర్భంగా ఢిల్లీ క్యాపిటల్స్ సీఈవో సునీల్ గుప్తా మాట్లాడుతూ కెనడాలో అకాడమీ ప్రారంభించడం ప్రపంచవ్యాప్త క్రికెట్ అభివృద్ధిలో కీలక మైలురాయిగా అభివర్ణించారు. కెనడాలోని యువ క్రీడాకారులకు కూడా భారత క్రికెట్ శిక్షణా విధానాలను అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. మరోవైపు అంటారియో క్రికెట్ అకాడమీ డైరెక్టర్ డెరెక్ పెరీరా ఈ భాగస్వామ్యం కెనడియన్ క్రికెట్ భవిష్యత్తును కొత్త దిశలో నడిపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.జీఎంఆర్, జేఎస్‌డబ్ల్యూ గ్రూపుల ఉమ్మడి యాజమాన్యంలో ఉన్న ఢిల్లీ క్యాపిటల్స్ 2008లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ ప్రారంభ సమయంలో ఢిల్లీ డేర్‌డెవిల్స్ పేరుతో ప్రయాణం మొదలుపెట్టి 2019లో ఢిల్లీ క్యాపిటల్స్‌గా కొత్త గుర్తింపును సంతరించుకుంది. ఇప్పుడు కెనడాలో అకాడమీ ప్రారంభంతో ఈ ఫ్రాంచైజీ అంతర్జాతీయ స్థాయిలో యువ క్రికెట్ అభివృద్ధికి మరింత బలమైన అడుగు వేసిందని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ఇది మాకు ఎంతో ప్రత్యేకం..

మెల్‌బోర్న్ డిసెంబర్ 27, 2025 మనగళం, : యాషెస్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాతో జరిగిన నాలుగో టెస్టులో ఇంగ్లండ్ సాధించిన విజయం తమకు ఎంతో ప్రత్యేకమని ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ వ్యాఖ్యానించాడు. దాదాపు 15 ఏళ్ల తర్వాత ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు విజయం నమోదు చేయడం తమ జట్టుకు గర్వకారణమని తెలిపాడు. ఇప్పటికే సిరీస్ చేజారిపోయిన నేపథ్యంలో ఈ మ్యాచ్‌లో గెలిచి ఆత్మవిశ్వాసాన్ని తిరిగి పొందామని స్టోక్స్ పేర్కొన్నాడు. మ్యాచ్‌కు ముందు జట్టుపై వచ్చిన విమర్శలు, ఒత్తిడిని ఆటగాళ్లు ఏమాత్రం పట్టించుకోకుండా పూర్తిస్థాయిలో ఆటపై దృష్టి పెట్టారని వివరించాడు.ఈ విజయం ఆటగాళ్లందరి సమిష్టి కృషి ఫలితమని, తాము తమ కోసం మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానుల కోసం కూడా ఆడుతున్నామని స్టోక్స్ చెప్పాడు. స్టేడియానికి వచ్చి అభిమానులు ఇచ్చిన ప్రోత్సాహం జట్టుకు అదనపు ఉత్సాహాన్ని అందించిందని పేర్కొన్నాడు. లక్ష్య ఛేదన సులువైనదేమీ కాదని, ప్రశాంతంగా ఆడుతూ ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి తీసుకురావాలనే వ్యూహంతో ముందుకెళ్లామని, అదే విజయానికి దారితీసిందని వెల్లడించాడు.ఈ మ్యాచ్‌లో పేసర్ జోష్ టంగ్ అద్భుతంగా రాణించి



ఇన్నింగ్స్‌లో కీలక వికెట్లు పడగొట్టాడని స్టోక్స్ ప్రశంసించాడు. బాక్సింగ్ డే టెస్టులో ప్రేక్షకుల ముందే ఇలాంటి ప్రదర్శన చేయడం విశేషమని పేర్కొన్నాడు. అలాగే లక్ష్య ఛేదనలో యువ ఆటగాడు బెథెల్ కీలకంగా రాణించి జట్టు విజయానికి బలమయ్యాడని తెలిపాడు. ఇలాంటి క్షణాల్లో యువ ఆటగాళ్లు ముందుకొచ్చి బాధ్యత తీసుకోవడం జట్టు భవిష్యత్తుకు మంచి సంకేతమని స్టోక్స్ అభిప్రాయపడ్డాడు.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.